ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు


5

ఆదివారం 27 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

27-4-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	25
తెనాలి	39	25
నరసరావుపేట	40	26
బాపట్ల	36	26
రెంటచింతల	40	27

sunday s.p.e.c.i.a.l



అల్లరి మాయం సెల్ మయం

స్క్రీన్ టైమ్‌లోనే **10 గంటలు**

ఒక రోజులో టీవీలు, మొబైల్, ట్యాబ్ లు, కంప్యూటర్లు వంటి వాటిని చూస్తూ గడపడాన్ని స్క్రీన్ టైమ్స్ అం టారు. ఒక రోజులో సగటు మనిషికి 4 నుంచి 5 గంటల మాత్రమే స్క్రీన్ టైమ్‌లో ఉండాలి. కానీ పిల్లలే రోజుకు దాదాపు 10 గంటల వరకు స్క్రీన్ టైమ్‌కు కేటాయిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోని ప్రతి 10 మంది పిల్లల్లో 8 మంది అధికంగా స్క్రీన్ టైమ్స్‌లో గడపటం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

> డిజిటల్ బేబీలుగా పుడుతున్న ప్రస్తుత తరానికి ఊహ రాగానే వారి చేతికి ఫోను అందించి వారి జీవితాల్ని మొగ్గ దశలోనే నాశనం చేస్తున్నారు.
> - డాక్టర్ ప్రియాంక్‌జైన్, ఢిల్లీకి చెందిన పిల్లల వైద్య నిపుణులు

అల్లరితోనే.. ఆయుష్షు

ఏ కదలిక లేకుండా పిల్లలు కూర్చోవడం వల్ల తల్లిదండ్రులకు సౌకర్యంగా ఉంటుదేమోగాని చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదు. పిల్లల్లో అల్లరే వారికి ఆయుష్షు అని తెలుసుకోవాలి. అల్లరి చేస్తేలే వారికి ఆరోగ్యం అని ప్రస్తుత తరం తల్లిదండ్రులు గుర్తించుకోవాలి. ఏడేళ్లు కాపాడితే మొక్క కూడా మహా వృక్షమై తరతరాలకు నీడనిస్తుంది అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలు పిల్లలకు కూడా అనువ దించా ల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. అల్లరి చేయడం లేదనే విషయాన్ని మానసిక లోపంగా గుర్తించాలే తప్ప గొప్పగా భావించకూడదు.



అమ్మో గడుగ్గాయి.. ఒక్క క్షణం ఊరకే ఉండడు.. అల్లరితో ఆగమాగం చేస్తాడు.. ఇల్లు పీకి పంది రేస్తాడు.. పిల్లలు ఉండే ఇళ్లు.. వీధులు.. కాలనీ లు వారి అల్లరిచిల్లర పనులతో సందడిగా ఉం డేవి.. అయితే ఇదంతా గతం. అలాంటి పరి స్థితులు ప్రస్తుతం నగరాలు కాదు కదా.. పట్ట ణాలు.. పల్లెల్లో కూడా కాన రావడంలేదు. పెద్దల తో పాటు పిల్లలు కూడా సెల్‌ఫోన్లతో కాలం గడుపుతున్నారు. కాలక్షేపం చేస్తున్నారు. ఊయ లలో ఉండే చిన్నారులకు కూడా తల్లులు సెల్ ఫోన్ చూపిస్తూ వారి అల్లరిని కట్టడి చేస్తు న్నారు. దీంతో ప్రస్తుత తరం డిజిటల్ బేబీలుగా మారుతున్నారు. చందమామా రావే.. జాబిల్లి రావే అంటూ పెద్దలు చిన్నారులకు గోరుముద్దలు తినిపించే రోజులు మాయమై పోయా యి. ఇప్పుడంతా సెల్‌మయమే. ఏడు స్తున్నా.. అల్లరి చేస్తున్నా.. తినిపిం చాలన్నా.. సెల్‌ఫోన్ ఇచ్చేస్తు న్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే బొమ్మలు చూస్తూ అదే లోకంగా ఉండిపోతున్నారు. స్క్రీన్ మాయ లో పిల్లలు సర్వసాధారణ లక్షణాలైన ముద్దు ముద్దు మాటలు.. అల్లరి.. నవ్వడం.. ఏడవడం.. తదితర లక్షణాలను కోల్పోతున్నారు.

- కనుమరుగవుతోన్న గడుగ్గాయిలు
- డిజిటల్ బేబీలుగా మారుతోన్న చిన్నారులు
- ఎక్కువ సమయం స్క్రీన్ టైమ్‌తో పిల్లలు
- భావితరం భవిష్యత్‌కు ముప్పంటున్న వైద్యులు
- రక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటూ సూచన



గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేతికి దొరికింది నోట్లో పెట్టుకోవడం లేకపోతే పగల గొట్టడం.. వస్తువులను చిందరవందరగా పడేయడం.. బొమ్మలు పగలగొట్టడం.. గాయాలు చేసుకోవడం.. ఏడవడం.. నవ్వడం.. ఇదంతా చిన్న పిల్లల లక్షణాలు. అయితే ఈ అల్లరి చేష్టలు మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయా అంటే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తే అవునంటున్నారు.. మానసిక వైద్యనిపుణులు. యాంత్రిక జీవితానికి తల్లిదండ్రులు అలవాటు పడిపోగా.. అపురూపంగా పెంచాల్సిన పిల్లలను కూడా ఆ మాయలో పడేస్తున్నారు. కౌమార, యవ్వన దశలో ఉన్న వారిపై స్మార్ట్ ఫోన్లు ప్రభావం చూపుతున్నాయని ఇప్పటి వరకు విన్నాం. కానీ వాటి ప్రభావం చిన్నారులపై కూడా పడిందనే కఠోర సత్యం తాజా పరిశోధనల్లో తేలింది. దీంతో చిన్నారుల ప్రవర్తన, నడవడికల్లో తీవ్ర మార్పులు వచ్చాయి. పిల్లలు ఏడ్చినా.. మారం చేసినా వారి చేతికి ఫోను ఇవ్వడం వల్ల ఇటువంటి ఉపద్రవం వచ్చిందని (మిగతా 8వ పేజీలో)

పిల్లలో సమస్యలు..



పిల్లలు అదేపనిగా స్క్రీన్‌టైమ్‌లో గడపటం వల్ల ఆయా స్క్రీన్లలో చూసిన విషయాలు మినహా వారి మెదళ్లలో ఇంకేమి ఉండటం లేదు. తలనొప్పి, వెన్నుముక నిటారుగా లేకపోవడం, స్వచ్ఛంగా మాట్లడలేకపోవడం, కంటికి ఇబ్బందులు వంటి ఆరోగ్యపరమైన సమస్యలతో భావి తరమైన నేటి పిల్లలు అల్లాడుతున్నారు. రానున్న రోజుల్లో పెద్దలకు దూరంగా ఉండటం, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఇచ్చిన వారి పట్ల కృతజ్ఞతా భావం, ఊబకాయం, ఫోన్‌లో ఆడే గేము ల్లో రివార్డులు వస్తే అమితంగా సంతోషపడటం, ఒంటరిగా గడపాలనే ఆలోచన.. వంటి మానసిక సమస్యలు పిల్లల్లో వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వేగవంతంగా మోదీ పర్యటన ఏర్పాట్లు

- వీవీఐపీలు 100, ఎంఐపీలు 15 మంది రాక
- ఎవరూ ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలి
- ప్రధాన మంత్రి కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండియన్
- సభా ప్రాంగణంలో అధికారులతో సమీక్షలు



వెలగపూడిలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



సమీక్షలో మాట్లాడుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో శుక్రవారం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని సభకు 100 మందికి పైగా వీవీఐపీలు, 15 మంది వరకు ఎంఐపీలు, 5 వేల మంది వరకు వీఐపీలు రానున్నారు. ఈ క్రమంలో ఆ స్థాయిలో అధికారులు వెలగపూడి సచివాలయం సమీపంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజధాని నిర్మాణ పనుల ను పునర్ ప్రారంభించేందుకు అమరావతికి రానున్న నరేంద్ర మోదీ పర్యటనని విజయవంతం చేయాలని ప్రధానమంత్రి కార్యక్రమ నోడల్ అధికారి, సీనియర్ ఐఏఎస్ వీరపాండియన్ ఆదేశించారు. సచివాలయం వెనుక వేదిక ప్రాంగణంలో జరు గుతున్న ఏర్పాట్లను సంబంధిత నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వీరపాండియన్ మాట్లాడుతూ మోదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో సచివాలయానికి చేరుకుంటారన్నారు. అనంతరం 1.4 కిలో మీటర్ల మేర రోడ్డు షో ద్వారా సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. సభ అనంతరం సాయంత్రం ఐదు గంటలకు హెలికాప్టర్లో గన్నవరం చేరుకుని ఢిల్లీ వెళ్తారని చెప్పారు. ప్రధాని సభకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రముఖులు చేరుకునేలా 8 రూట్లను సిద్ధం చేస్తున్నామని, వాహనాలు పార్కింగ్ కోసం 9 స్థలాలను గుర్తించి అక్కడ తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. సభకు వచ్చే ప్రజలందరికీ పూర్తి స్థాయిలో ఆహారం అందించడం జరుగుతుందని, ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలతో పాటు ప్రముఖులు కూడా ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 30న రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పీజీ రిహార్సల్స్ ఉంటుందన్నారు. ప్రధాని వచ్చే సమయానికి పూర్తిస్థాయిలో ప్రజలందరికీ ఆహారం అందించటం జరుగుతుందని ఇందుకు సంబంధించి ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్కింగ్ ప్రాంతంలో నిరంతరం మైక్ అనౌన్స్‌మెంట్ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ డ్యూటీ పాస్‌లకు సంబంధించి ఆయా శాఖలు వెంటనే జాబితా ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఐజీలు శ్రీకాంత్, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సీయూఎం త్రివిక్రమవర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులను గౌరవించుకునే సభ : మంత్రి మనోహర్

ప్రధాని మోదీ సభ ద్వారా రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను గౌరవించుకునే కార్యక్రమం అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వెలగపూడిలో ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఐదు, ఆరు జిల్లాల నుంచి నాలుగు లక్షల నుంచి ఆరు లక్షల వరకు రావడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సోమవారం ఎస్పీజీ సిబ్బంది వచ్చి సభా ప్రాంగణాన్ని పరిశీలించిన తర్వాత వారి సూచనలకు అనుగుణంగా ఏమైనా ఏర్పాట్లు అవసరమో పునర్ పరిశీలిస్తామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుని పూర్తిగా ఉపయోగించుకుంటామన్నారు. అవసరమైతే పశ్చిమ బైపాస్ రోడ్డుని కూడా ఉపయోగించుకోవాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఉండాలని సీఆర్‌డీఏ అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. సభా వేదిక వద్దకు దారితీసే రోడ్లను మంత్రి పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడల్ అధికారి వీర పాండ్యన్ , గుంటూరు రేంజ్ ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజ, ఆర్డీవో కె. శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

12,671 మందికి రూ.25.34 కోట్ల భృతి

- ఎన్నికల హామీని అమలు చేసిన ప్రభుత్వం
- నిజాంపట్నం హార్బర్‌లో త్వరలో అన్నక్యాంటిన్ ఏర్పాటు
- మత్స్యకారుల సేవ సభలో మంత్రి అనగాని

రేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 12,671 మంది మత్స్యకారులకు వేట విరామ భృతి కింద రూ.25.34 కోట్లు పంపిణీ చేసినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మత్స్యకారుల సేవ పథకం ద్వారా జిల్లాలోని గంగపుత్రులకు వేట విరామ భృతి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇచ్చిన హామీని అమలు చేసిందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున వేట విరామ భృతిగా ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో రూ.10 వేలే అందించిందని కూటమిప్రభుత్వం దాన్ని రెట్టింపు చేసిందన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆక్వారంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నిజాంపట్నం మండలం దిండి ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నిజాంపట్నంలో కొండ పోరంబోకు స్థలాల్లో ఇళ్ల కట్టుకున్న పేదలకు త్వరలో పట్టాలు అందజేస్తామన్నారు. మత్స్యకారుల ఆకలిని తీర్చేందుకు హార్బర్‌లో అన్నక్యాంటిన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో చంద్రబాబు విజన్ 2020 అంటే చాలామంది నవ్వారని కానీ ఆ ఫలితాలను ఇప్పుడు ప్రతీ కుటుంబం అనుభవిస్తుందని చెప్పారు. పీ4 పథకం పేదల బతుకుల్లో మార్పులు తీసుకువస్తుందన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ మత్స్యకారులకు వలలు, బోట్లు అందింజేస్తామన్నారు. హార్బర్ అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. మడ అడవులను పర్యాటక కేంద్రంగా తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా పీసీ చైర్మన్ పంతాని మురళీధరరావు, మత్స్యశాఖాధికారి శ్రీనివాస్‌నాయక్, డీపీవో ప్రభాకర్, పౌరసరఫరాల శాఖాధికారి విలియమ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీనివాసరావు, జడ్‌పీటీసీ నర్రా సుబ్బయ్య, టీడీపీ నాయకులు దండుప్రోలు వెంకటేశ్వరరావు, బొమ్మిడి రామకృష్ణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు నగదు చెక్కును అందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి

ఎట్టకేలకు సీసీబీకి టెండర్

- రూ.18.09 కోట్లతో 75 పడకల ఆస్పత్రి
- పీఎం ఆయుష్మాన్ భారత్ కింద నిధులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నరసరావుపేటలోని ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ) నిర్మాణానికి ఎట్టకేలకు ప్రభుత్వం టెండర్ పిలిచింది. ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో బిడ్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. నెల రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధాన మంత్రి ఆయుష్ మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా మిషన్ కింద రూ.18.09 కోట్లు కేటాయించారు. పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల మధ్య నెలకొన్న స్థల వివా దంతో సీసీబీ టెండర్ నిర్వహణలో ఆరు నెలలు జాప్యం జరిగింది. పోలీసుశాఖ ఆస్పత్రి స్థలాన్ని వదిలేయడంతో ఎట్టకేలకు ఏపీఎంఎస్ఐడీసీ టెండర్ ప్రక్రియ చేపట్టింది. దీంతో సీసీబీ నిర్మాణానికి మార్గం సుగమమైంది.



సీసీబీ నమూనా భవన చిత్రం

పేదలకు వరం..

కేంద్ర ప్రభుత్వం నరసరావుపేటకు మంజూరు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ పేదలకు వరం. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో సీసీబీ నిర్మిస్తుండటం పేదలకు వరమనే చెప్పాలి. 200 పడకల సామర్థ్యం ఉన్న ఏరియా ఆస్పత్రికి సీసీబీలో 75 పడకలు కేటాయిం చింది. సీసీబీలో ఐసీయూ, ఐసో లేషన్ వార్డులు, ఓటీ, లేబర్.. డెలి వరీ.. రికవరీ గదులు (ఎల్‌డీఆర్స్) ఉంటాయి. 75 పడకల సీసీబీని 6,375 చదరపు మీటర్ల వైశాల్యంలో నిర్మిస్తారు. ఐసోలేషన్ వార్డులో 30 పడకలు ఉంటాయి. ఐసీయూలో 12 పడకలు(రెండు చిన్నపిల్లలకు) ఉంటాయి. ఐసోలేషన్ రూమ్స్‌లో ఐదు పడకలు. డయాలసిస్‌లో నాలుగు, ఎంసీహెచ్‌లో నాలుగు, ఎమర్జెన్సీలో నాలుగు రెడ్, నాలుగు ఎల్లో, మరో రెండు పడకలు మొత్తం 10 ఉంటాయి. భవన నిర్మాణం, బెడ్లు, అత్యాధునిక వైద్య పరికరాలను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. నిర్వహణ ఖర్చు 75 పడకలకు రూ.5.84 కోట్లుగా అంచనా వేశారు. భవన నిర్మాణానికి రూ.18.09 కోట్లు, పరికరాలకు రూ.11.40 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఆరుగురు స్పెషలిస్టు వైద్యులు, జీడీఎంలు 14 మంది, నర్సులు 90 మంది, హెల్త్ ప్రొఫెషనల్స్ 9 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 9 మందిని నియమిస్తారు.



సీసీబీ ప్రతిపాదిత స్థలం

బగళాముఖి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానానికి శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి కుటుంబ సమేతంగా విచ్చేశారు.



బగళాముఖి అమ్మవారి సన్నిధిలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, కుటుంబ సభ్యులు

అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో దేవస్థానం తరుపున వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి చిత్రటాన్ని బహూకరించినట్లు ఈవో జీ నరసింహమూర్తి తెలిపారు.

జనానికి పొగబెట్టి..

రైతులను మురుగులో ముంచేస్తారా!

● రూ. 3.19 కోట్లు ఖర్చుపెట్టి చేసేది ఇదేనా? ● చెత్త నిర్వహణ తీరుపై మండిపడ్డ మంత్రి మనోహర్

తెనాలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'చుట్టుపక్కల నివాసాలుంటే ఈ పొగపెట్టడమేంటీ.. డంపింగ్ యార్డు మురుగు పక్కనున్న రైతుల పొలాలు నాశనంచేస్తుంటే ఏం చేస్తున్నారు.. కొబ్బరి బోండాలు పేరుకుపోయి, దోమలు పెరిగిపోతున్నాయి.. ఈ యంత్రాలను తుప్పు పట్టిస్తున్నారు! ఇదేనా ప్రజాధనం సద్వినియోగం చేయటమంటే? మీరు అసలు ఇంజనీర్లేనా! ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోతే ఎలా?' అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. ఇకపై పని తీరు సక్రమంగా లేకుండా, నిర్లక్ష్యంగా ఉంటే మా దగ్గర అవసరంలేదంటూ హెచ్చరించారు. మంత్రి మనోహర్ శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జరుగుతున్న పనులు, అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. దీనిలో భాగంగానే బుర్రిపాలెం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. రూ. 3.19 కోట్లతో చెత్తను ఎరువుగా తయారుచేసే పనులను చూశారు. ఒప్పందం ప్రకారం కా కుండా చెత్తను కేవలం పైపైన సరిచేస్తే సరిపోతుందా అంటూ అధికారులను, కాంట్రాక్ట్ ప్రతినిధులను ప్ర శ్నించారు. మూడడుగుల లోతు పిట్ తీసి, కింది నుం చి చెత్తను ఎరువు రూపంలోకి మార్చాల్సి ఉంటే, పైపైన చేసుకుపోతుంటే మీరేంచేస్తున్నారని కమిషనర్ శేషన్న, ఏఈ, మిగిలిన ఇంజనీర్‌లను ప్రశ్నించారు. 'ఒప్పందంలో ఏముందో! కాంట్రాక్టర్ ఏం చేస్తున్నారో కూడా చూసుకోరా! రూ. కోట్ల ప్రజాధనం ఇస్తున్నామంటే ఆ మాత్రం బాధ్యత చూపలేరా!' అంటూ కేకలు వేశారు. డంపింగ్ యార్డులో కొబ్బరి బోండాలను పొడి చేసేలా ఏర్పాటు చేసిన యంత్రాన్ని నిరుపయోగంగా వదిలేయడంపైనా సీరియస్ అయ్యారు. ఏఈని ప్రశ్ని స్తే మోటార్లు రిపేరులో ఉన్నాయని బదులివ్వటంతో మంత్రి మండిపడ్డారు. గతంలోనూ తనని హెచ్చరించామని ఇట్లా అయితే బయటకు పంపేయడం ఒక్కటే మార్గమన్నారు. ఎక్కడ లోపం కనిపించినా, దానికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



చెత్త నిర్వహణ పనులపై అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

తప్పు మావల్లే జరిగింది... క్షమించండి

పొలాలు మురుగు మయమై పంట పండకుండా నష్టం కలగటానికి కారణం తామేనని, క్షమించమని మంత్రి నాదెండ్ల బాధిత రైతులను కోరారు. త్వరలో ఇబ్బందులు పడకుండా.. జాగ్రత్తలు తీసుకుంటామంటూ వివరణిచ్చారు. చెత్త సేకరణ కేంద్రం నుంచి చుట్టుపక్కల ఉన్న పొలాల్లోకి మురుగు చేరిపోవడం, చెత్త, ప్లాస్టిక్ కాగితాలు ఎగిరివెళ్లి చేలల్లో పేరుకుపోవడం వంటివాటిని పరిశీలించిన మంత్రి రైతులను పిలిచి క్షమాపణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శేషన్నకు ఆదేశాలు జారీ చేశారు.

అతి వేగం.. నిర్లక్ష్యం

● పల్నాడు జిల్లా శాంతి నగర్ వద్ద ట్రావెల్ బస్సు బోల్తా ● ప్రమాదంలో ఒకరు మృతి, ఎనిమిది మందికి గాయాలు ● అతివేగంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని క్రాస్ చేయబోయి ప్రమాదం

శాంతినగర్(నకరికల్లు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నకరికల్ల మండలం శాంతినగర్ మంచినీటి చెరువు వద్ద హైదరాబాద్ నుంచి చీరాల వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు శనివారం ఉదయం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ నుంచి చిలకలూరిపేటలో బంధువుల పెళ్లికి వెళ్తున్న మహమ్మద్ ఫరూక్(55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను వాహనాల్లో నరసరావుపేటకు తరలించారు. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదానికి కారణమని క్షతగాత్రులు చెబుతున్నారు. పోలీసులు, బస్సులోని ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి ట్రావెల్ బస్సు చీరాలకు బయలు దేరింది. బస్సు నకరికల్లు అడ్డ రోడ్డు దాటిన తర్వాత బోల్తాపడిందని ప్రయాణికులు చెప్పారు. రోడ్డు సైడు ఎడ్జస్టమెంట్ చూసుకోకుండా అంతివేగంగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఓ మహిళ బస్సు లోపల కింది భాగంలో ఇరుక్కుని పోవడంతో.. క్రేన్, ఎక్సకవేటర్ సాయంతో బస్సును పైకి లేపి ఆ మహిళను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మార్టూరుకు చెందిన అవనిక అనే యువతి బురదలో కూరుకుపోయింది. సుమారు గంటన్నర వరకు పైగా పోలీసులు, స్థానికులు ఆమెను అతి కష్టం మీద బయటకు తీశారు. అద్దంకి మండలం జంతాలకు చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు, ఉయ్యాల సీత, రొంపిచర్ల మండలం దాసరిపాలేనికి చెందిన వేల్పుల నాగజ్యోతి, వేల్పుల నాగార్జున, బాపట్ల జిల్లా వలపర్ల గ్రామానికి చెందిన వంకాయల మోహన్, చీరాలకు చెందిన ఎడవల్లి నాగ వెంకట మోహన్ రావు, నాలుగేళ్ల వయస్సున్న కోట రుహికలు గాయపడ్డారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ అంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వివరాలు అడిగి తెలు సుకున్నారన్నారు. సకాలంలో క్షతగాత్రులకు ఆస్పత్రికి తరలించి వైద్య అందించిన పోలీసులను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, రూరల్ ఎస్ఐ కిషోర్, నకరికల్లు ఎస్ఐ సీహెచ్ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.



బోల్తా పడిన ట్రావెల్ బస్సు (ఇన్‌సెట్లో) మృతుడు మహమ్మద్ ఫరూక్

నాలుగేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

మేడికొండూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అభంశుభం తెలియని నాలుగేళ్ల బాలికపై ఒక కామాంధుడు అత్యాచారయత్నం చేసిన ఘటన మేడికొండూరు మండలం మందపాడు గ్రామంలో శనివారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మందపాడు గ్రామంలో గంగోలు రాజు (52) అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికకు చాక్లెట్ ఇస్తా నని ఆశ చూపి తన ఇంటికి తీసుకువెళ్లాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. కొంత సేపటి నుంచి బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి సమీప ప్రాంతంలో వెతికింది. బాలికతో ఆడుకునే మరో బాలిక ఇచ్చిన సమాచారంతో గంగోలు రాజు ఇంటికి వెళ్లి చూసింది. తన కూతురి పట్ల రాజు వికృత చేష్టలు చూసి బయపడిపోయింది. వెంటనే తన కుమార్తెను తీసుకుని బయటకు పరుగులు తీసింది. జరిగిన విషయాన్ని స్థానికులకు చెప్పడంతో.. కోపోద్రిక్తులైన వారు రాజుని బంధించి మేడికొండూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు రాజు నేర చరితుడని మందపాడు గ్రామంలో 2006లో జరిగిన హత్య కేసులో ముద్దాయని పోలీసులు తెలిపారు. పాపను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి వేతనం రూ.300 అందాలి

● రోజుకు 90 వేల మంది శ్రామికులకు పనులు కల్పించాలి ● పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ శ్రామికుల సగటు వేతనం రూ.300 పైనే ఉండేలా పనులు చేపట్టాలని, రోజుకు 90 వేల మందికి ఉపాధి కల్పించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఉపాధి పని దినాల్లో.. భారీగా కోత.. అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలవడిన కథనంపై కలెక్టర్ స్పందిం చారు. కలెక్టరేట్‌లో శనివారం ఉపాధి పనుల అమలుపై సమీక్షించారు. రోజుకు 90 వేల శ్రామికులకు ఉపాధి కల్పిం చడం లక్ష్యంగా నిర్దేశించగా సగటున 50 శాతం మంది మా త్రమే ఉపాధి పొందుతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు ఉపాధి కల్పనలో రోజు వారీ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాకు మంజూరైన 6,500 ఫాం పాండ్లకుగానూ 2,200 పాండ్ల నిర్మాణానికి అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన 4,341 పాండ్ల నిర్మాణాలు.. దాదాపు 12,000 కి.మీ మేరకు కాల్వల పూడిక తీత పనులు, 553 చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో మురళి, జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియ, డ్వామా పీడీ సిద్ధ లింగ మూర్తి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సంగీత ప్రదర్శనలో ముగ్గురికి గిన్నిస్ రికార్డు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు, బాలుడు గిన్నిస్ రికార్డు సాధించారు. 2024 డిసెంబరులో జరిగిన ప్రపంచస్థాయి సంగీత ప్రదర్శనలో వీరు పాల్గొన్నారు. 18 దేశాల నుంచి 1,046 మంది కీబోర్డు వాయిద్యం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న బాలుడు నిశ్శంకరరావు అభిషేక్, బాలికలు యండ్రపాటి నయనశ్రీ, మౌనిక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ సంస్థ ప్రతినిధుల నుండి సర్టిఫికెట్, మెడల్ అందుకున్నారు. వీరు హాలేల్ మ్యూజిక్ స్కూల్ అగస్టీన్ వద్ద శిక్షణ పొందారు. గిన్నిస్ రికార్డు అందుకున్న వారిని పలువురు అభినందించారు.



గిన్నిస్ రికార్డులు అందుకుంటున్న బాలికలు యండ్రపాటి నయనశ్రీ, మౌనిక, బాలుడు నిశ్శంకరరావు అభిషేక్

భార్యపై అనుమానంతో పక్కింటి వ్యక్తిపై కత్తితో దాడి

రేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డులో నివాసం ఉంటున్న దేవరకొండ కోటి అనే వ్యక్తి శనివారం పక్కింట్లో ఉంటున్న దేవరపల్లి నవీన్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు.. దేవరకొండ కోటి తన భార్యకు, నవీన్‌కు అక్రమ సంబంధం ఉందని అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో నవీన్‌ను కత్తితో విచక్షణా రహితంగా నరికాడు. స్థానికులు గుర్తించి తీవ్రంగా గాయపడిన నవీన్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అతనిని గుంటూరు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వడ గాల్పులకు వృద్ధుడి మృతి

బెల్లంకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెంలో శనివారం మధ్యాహ్నం వడగాల్పులకు వృద్ధుడు చిన్న సుబ్బయ్య (81) మృతి చెందాడు. వడ గాల్పులకు తట్టుకోలేక అతను మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తిలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పులుసు వీరారెడ్డి (40) తన రెండెకరాలతో పాటు మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంటలు సాగు చేశాడు. మూడేళ్లుగా పంటలు సరిగా పండక సుమారు రూ.25 లక్షలు దాకా అప్పులు పేరుకుపోయాయి. దీంతో మనస్తాపం చెందిన వీరారెడ్డి పొలానికి వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చీకటి పడుతున్నప్పటికీ అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా వీరారెడ్డి విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య పిచ్చమ్మ, ఇద్దరు కొడుకులున్నారు.



పులుసు వీరారెడ్డి (ఫైల్‌ఫొటో)

నవ్వినందుకు ఇంటిపై దాడి

● కంతేరులో ఇరువర్గాల వివాదం
● పోలీసులపై వైసీపీ ఎంపీటీసీ దురుసు ప్రవర్తన

తాడికొండ(కంతేరు)ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుకునే విద్యార్థుల మధ్య జరిగిన గొడవ.. ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. పాఠశాలలో దళిత సామాజికి వర్గానికి చెందిన విద్యార్థులు కొట్టుకోవడంతో వారిని చూసి నవ్వాడనే కారణంతో మరో సామాజికి వర్గానికి చెందిన విద్యార్థి ఇంటిపైకి దాడి చేసిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు.. మరో వర్గానికి చెందిన వారి ఇంటిలో మహిళను, అమె కొడుకుపై దాడి చేసి, దుర్భాషలాడి చంపేస్తామని హెచ్చరించారు. ఇరువర్గాల మధ్య వివాదం జరుగుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని పంపించి వేశారు. దళిత వర్గానికి చెందిన యువకులపై అకారణంగా మరోవర్గం దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన దళిత సంఘాలతో కలిసి శనివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో పాటు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ వాసు స్టేషన్‌కు చేరుకొని వారితో మాట్లాడారు. ఫిర్యాదు ఇవ్వకుండా కేసు నమోదు ఎలా చెస్తామని సీఐ ప్రశ్నించారు. అనంతరం వారు దళిత సంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. రెండవ వర్గానికి చెందిన మహిళ తనపై దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోలీసులపై దురుసుగా మాట్లాడుతున్న వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

జలవనరుల కింద కాల్వల మరమ్మతులు చేపట్టాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జలవనరుల కింద పంటకాల్వల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టాలని సంబంధితాధికారులను కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. డీఆర్‌సీలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరుఛానల్, నల్లమడ డ్రెయిన్ అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాలన్నారు. గుంటూరుఛానల్ విస్తరణకు 4 ఎకరాల స్థలం భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే 15 కోట్ల రూపాయల నిధులు మంజూరు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపిన విషయాలపై సమీక్షించారు. మైనర్ కాల్వలపై 119 మరమ్మతుల పనులకు 10.68 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం అవన్నీ టెండర్ దశలో ఉన్నాయన్నారు. పంట కాల్వల మరమ్మతులు, పూడికతీత పనులు చేయటానికి ప్రభుత్వం 454 పనులు గుర్తించిందన్నారు. యుద్ధప్రాతిపదికన వాటిని చేపట్టేందుకు రూ.12.59 కోట్ల నిధులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. వరద ప్రభావంతో దెబ్బతిన్న పంటకాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేయటానికి 148 పనులు గుర్తించామన్నారు. వీటికి 7.75 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో పంటకాల్వలలో నీరు లేనందున మరమ్మతు పనులు వేగంగా ప్రారంభించాలన్నారు. సమావేశంలో సీపీవో కె.శ్రీనివాసరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్

మెడికల్ షాపులకు సర్టిఫికెట్‌లో పేరు ఉండే విధంగా చూడాలి

● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ షాపులకు సంబంధించిన పేర్లు, బీ ఫార్మశీ సర్టిఫికెట్‌లో పేర్లు ఒకే విధంగా ఉండేటట్లు చూచుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో శనివారం డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ జిల్లా కమిటీ, ఎఆర్‌టి సరోగసి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొత్త స్కాన్‌సెంటర్‌లకు అనుమతులు, కొన్నిస్కాన్ సెంటర్‌లకు రెన్యువల్, క్యాన్సిలేషన్, మోడిఫికేషన్‌లకు సంబంధించిన అనుమతులు గురించి చర్చించారు. కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గర్భిణులకు సంబంధించి ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో ట్రాన్స్‌ఫర్ ఇన్, ట్రాన్స్‌ఫర్ ఔట్ సౌకర్యం కల్పించాలన్నారు. డీఆర్‌వో గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ స్కాన్‌సెంటర్‌ల వారు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మోజెస్, సీఐ ఆర్.అహ్మద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రామకృష్ణహనుమాన్, డాక్టర్ డేవిడ్ సాల్మన్, డాక్టర్ భూషణం, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ మనోజ్, బి.మరియమ్మ, అరుణ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు వర్క్‌షాపులు దోహదం

● బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటానికి వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న ఎలక్ట్రోహ్యాక్‌ఫెస్ట్ 2025 శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి 120 మందికి పైగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు సభలో ముప్పలనేని మాట్లాడుతూ స్మార్ట్ మొబలిటి, వాహనభద్రత, కృత్రిమ మేధస్సు రంగాలలోని తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవటం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేందుకు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ హ్యాకథన్ చక్కటి వేదిక అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి నిపుణులుగా వ్యవహరించిన ఆటోమోటివ్ ఇంజనీర్లు, ఈగల్ టెక్నాలజీస్‌వారు ఎస్.సంజయ్ కుమార్, బికె.విఘ్నేష్ మాట్లాడుతూ ఎలక్ట్రోహ్యాక్ ఫెస్ట్ విద్యార్థులకు ఒక మంచి అనుభవాన్ని అందించటమే కాకుండా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించటానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. హ్యాకథన్‌లో విద్యార్థులు విద్యుత్ వాహనాలు, స్మార్ట్‌గ్రిడ్ టెక్నాలజి, పునరుత్పాదకశక్తి వనరులు, ఆటోమేషన్ వంటి వివిధ అంశాలపై నూతన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి అధ్యక్షత వహించగా టాటామోటర్స్ అండ్ టెక్నాలజిస్ ప్రోగ్రామ్ మేనేజర్ ముత్తినేని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలను అభినందించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కారుమంచి వెంకట్రావు, పారేపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, ఎస్.సంజయ్‌కుమార్, బికె.విఘ్నేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించి సన్మానించారు.



అతిథులను సన్మానిస్తున్న అధ్యక్ష కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు తదితరులు

పట్టణంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



కార్లు తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సిబ్బంది

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయటమే లక్ష్యంగా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఆర్.రాంబాబు సిబ్బందితో కలిసి పట్టణంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ కండెక్ట్ చేశారు. ఏకకాలంలో బాపట్ల రైల్వేస్టేషన్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, లాడ్జీలు, హోటళ్ళు, రెస్టారెంట్‌లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. వాహనాలు తనిఖీ చేశారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. లేనిచో అనుమానిత వాహనంగా గుర్తించి సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు విజయ్‌కుమార్, చంద్రావతి, 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

కేబీ పాలెంలో ప్రభుత్వ స్థలం కబ్జాకు ప్రయత్నం

బాపట్లరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం గ్రామంలో శ్మశాన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నది. వివరాల్లోకి వెళితే... కొండుభొట్లవారిపాలెం గ్రామంలో సర్వేనెంబరు 847/2లో ఎకరం 23 సెంట్లు ప్రభుత్వ స్థలం కలదు. అయితే ఈ స్థలంలో కొంతమంది ఇంటి నిర్మాణం పనులు చేపట్టటంతో ఇంకొకరు తాతలు, ముత్తాతలు నుంచి పొలం సాగు చేసుకుంటున్నామంటూ ఇంటినిర్మాణం చేపట్టిన స్థలం చుట్టూ పెన్సింగ్‌ను వేశారు. ఈ విషయంపై పంచాయతీ రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వ స్థలంలో జరిగిన అక్రమణపై ఉన్నతాధికారులకు తెలియజేయటం జరిగిందని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

ఐసీడీఎస్ భవన నిర్మాణం పూర్తయ్యేనా?

● దశాబ్దకాలంగా అంగన్‌వాడీల ఇక్కట్లు
● పట్టించుకోని పాలకులు, అధికారులు



బాపట్లలోని ఐసీడీఎస్ కార్యాలయం పై అంతస్థు పూర్తి చేయకుండా వదిలేసిన చిత్రం

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు పెద్ద పీట వేసి పని చేస్తున్నామని చెప్పే పాలకులు, అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని చెప్పే అధికారులు ఆ దిశగా పనులు చేయకపోవటం వల్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, కార్యాలయ సిబ్బంది నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బాపట్ల ఐసీడీఎస్ పరిధిలో 253 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మున్సిపల్ హైస్కూల్ వెనుకవైపు ఐసీడీఎస్ కార్యాలయాన్ని 2013వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గాదె వెంకటరెడ్డి కృషితో ఏపీఈఆర్ నిధులు రూ.53 లక్షలు వెచ్చించి నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తి చేసిన అధికారులు పై అంతస్థు స్లాబ్ వేసి వదిలేశారు. నిధులు చాలలేదని చెప్పి దీనిని వదిలేయటం వల్ల సీడీపీవో, సూపర్‌వైజర్‌లు, కంప్యూటర్ రూమ్‌లు పోను మిగిలిన హాలులో సమావేశాలు పెట్టుకుంటున్నారు. ప్రతి నెల ప్రాజెక్ట్ సమావేశం జరిగేటప్పుడు 253 మంది కార్యకర్తలు వస్తే అందులో కూర్చోవటానికి స్థలం చాలటం లేదు. కొంతమంది మెట్లమీద, మరికొంతమంది బయట వరండాలో, మరికొంతమంది ఆరుబయట కూర్చొని సాయంత్రం వరకు పిచ్చపాటి మాట్లాడుకుంటూ కాలక్షేపం చేసి వెళుతున్నారు. దీనివల్ల అనుకున్న లక్ష్యం నెరవేరటంలేదు. బాపట్ల పట్టణ, మండలంలోని కార్యకర్తలకు ఒకరోజు, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల కార్యకర్తలకు మరొక రోజు ప్రాజెక్ట్ సమావేశం పెడితే కొంత వరకు సమస్య లేకుండా ఉంటుంది. అయితే ప్రాజెక్ట్ మొత్తం ఒకేసారి కలుసుకొని సమస్యలపై చర్చించుకోవటంతోపాటు అధికారుల సూచనలు, సలహాలు తీసుకునేందుకు ఒకేసారి రావాలని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

ఈ సమస్యకు పరిష్కారం చూపాలంటే అసంపూర్తిగా ఉన్న పై అంతస్థుకు మరమ్మతులు చేసి చుట్టూ గోడకడితే అందరికి ఒకేసారి సమావేశం నిర్వహించే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై స్పందించి అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యపై స్పందించి పై అంతస్థు పూర్తి చేయించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ప్రాజెక్ట్ సమావేశంలో కార్యాలయంలో ఖాళీ లేక మెట్లపైన, ఆరుబయట కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దత్తత కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అధికారుల బృందం దత్తత కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయంలో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, శిశుగృహ, బాలికాసదన్, వన్‌స్టాప్ సెంటర్, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్, పోలీసు శాఖాధికారులతో దత్తత విధానంలో జాప్యం గురించి సమావేశం నిర్వహించారు. ముందుగా శిశుగృహాలలో వదిలేయబడిన పిల్లలు, అనాధపిల్లలు, సరండెడ్ పిల్లలు గురించి ఒక్కొక్క బిడ్డ విషయమై సమీక్షించారు. దత్తత వెళ్ళటానికి పిల్లల గ్యాప్ ఉండరాదన్నారు. దత్తత త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఓఎస్‌సీ సెంటర్‌లో ప్రతినెల ఎన్ని కేసులు వస్తున్నాయి. రిజిస్ట్రేషన్ ఎంత అవుతుంది, ఎంతమంది మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చారు అనే విషయాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్, జిల్లా బాలల సంరక్షణాధికారి పి.పురుషోత్తంరావు, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికా సదన్‌లో కిషోర బాలికల వసతులు అడిగి తెలుసుకుంటున్న పద్మావతి తదితరులు

ఉగ్రవాదుల దాడి దారుణం : నామన



సమావేశంలో మాట్లాడుతున్న నామన వెంకటశివన్నారాయణ

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జమ్ము-కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడి దారుణమని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ అన్నారు. ఈవిషయమై శనివారం జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జిడుగు విజయమాధురి, ఊసా మాధవి, అంకిశెట్టి నాగమల్లేశ్వరి, సత్యనారాయణ, కొత్రా మణికంఠ, షేక్ కరీముల్లా, కేఆర్‌కే నాయుడు, బడే అంకమ్మరావు, బాబురావు, ఊసా ప్రసాద్, కొక్కిరాల రాజేంద్ర, జిడుగు రాజేష్, పూల శ్రీనివాసరావు, గంగూరి మోహన్, సిగిరిశెట్టి సంజయ్యనాయుడు, జనసేననాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా యూటీఎఫ్ బాపట్లజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి మద్దాల సురేష్, మండలాధ్యక్షుడు నాగార్జున, పట్టణ అధ్యక్షుడు రాజేష్, కర్లపాలెం అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, సీనియర్‌నాయకులు రవికాంత్, కృష్ణంరాజు, కొండా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ మూలమంత్ర గాయత్రి హోమం

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగేంద్రపురం గ్రామంలో ఉన్న శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో శనివారం త్రయోదశి ఉత్తరాబాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సువర్చలాదేవి సమేత ప్రసన్నాంజనేయస్వామి, సిద్ధిబుద్ధి సమేత సంపత్‌గణపతి స్వామికి పంచామృతాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనుమత్ మూలమంత్ర గాయత్రి హోమం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు. ఆదివారం ప్రసన్నాంజనేయస్వామి కల్యాణం జరుగుతుందని కన్వీనర్ బి.బాబునాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో మామిడి రాజశేఖర్, శ్రీహరి నారాయణ, కావూరి శ్రీనివాసరెడ్డి, మలిశెట్టి భ్రమరాంబ, మామిడి పద్మావతి, శ్యామలాదేవి, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, వెలగా ప్రసన్నాదేవి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, దీక్షాపరులు పాల్గొన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు బాపట్లలోనే బీజం

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు బాపట్లలోనే బీజం పడిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. 1926 ఏప్రిల్ 26వ తేదిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవిర్భవించిందన్నారు. విశ్వవిద్యాలయం స్థాపించి నూరు వసంతాలు అవుతున్నందున శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను శనివారం టౌన్‌హాలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, వసంత, నైమిశ, నాగమల్లేశ్వరి, వెంకటలక్ష్మమ్మ, చైతన్య, ఎం.నరసింహారావు, శ్రీనివాసరావు, న్యూస్‌పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికలో శ్రమదానం

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామ హిందూ శ్మశాన వాటికలో గ్రామస్థులు శనివారం శ్రమదానం చేశారు. శ్మశానంలో పెరిగిపోయిన ముళ్ళచెట్లు, పిచ్చిమొక్కలు తొలిగించి శుభ్రం చేశారు. అంత్యక్రియలు చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా ఈ విధంగా చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



అన్నాభిషేకంలో అయ్యప్పస్వామి

వేమూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి రుద్ర చమకాలు పంచ సూక్తాలు మన్యుసూక్తంతో 27 పవిత్ర ద్రవ్యాలను స్వామి వారికి అభిషేకించారు. ఈ సందర్భంగా అన్న సూక్త పారాయణతో అన్నాభిషేకం జరిపారు. గణపతి హోమం, వాస్తు హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మహా కుంభ హారతి అనంతరం జరిపిన అన్నదాన కార్యక్రమంలో 4 వేల మంది భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప భక్త బృందం వారు శరణుఘోష పారాయణ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ వార్షిక తిరునాళ్ళ



శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

చెరుకుపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడవల్లి గ్రామంలో ఉన్న శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ళ శనివారం ఘనంగా జరిగింది. శనివారం సాయంత్రం జరిగిన స్వామివారి కల్యాణంలో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు గడ్డిపాటి రామ్మోహనరావు పర్యవేక్షించారు.

పాల రైతుల సంక్షేమమే సంగం డెయిరీ లక్ష్యం

● డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్



పాల రైతులకు చెక్కులను అందిస్తున్న ఎన్‌వీకే ప్రసాద్

నగరం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పాల ఉత్పత్తిదారుల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ సంగం డెయిరీ ముందుకు సాగుతుందని డైరెక్టర్ నర్రా వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. వివిధ కారణాలతో మృతిచెందిన వారికి వివిధ స్కీమ్‌ల ద్వారా సంగం డెయిరీ చెక్కులను శనివారం రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొత్తం ఏడు స్కీమ్‌లకు కలిపి ఏడు మందికి రూ.4,69,332లను అందించామని అన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ పి.వీరేంద్ర, రేపల్లె ఏరియా మేనేజర్ యలవర్తి గోపీకృష్ణ, ఫీల్డు కోఆర్డినేటర్ ఎ.నవీన్‌గౌడ్, పశువైద్యులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వితంతువులు పెన్షన్లకు నమోదు చేసుకోవాలి

చెరుకుపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు తీసుకుంటూ 2023 డిసెంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మరణించిన పెన్షనర్ల భార్యలు వితంతు పెన్షన్లకి నమోదు చేసుకోవాలని ఎంపీడీవో షేక్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం వారు భర్త మరణ ధ్రువీకరణపత్రం, ఆధార్, రేషన్‌కార్డు నకలు, ఫోన్‌నెంబర్ తదితర వివరాలతో సంబంధిత సచివాలయ వెల్ఫేర్, విద్యాసహాయకులని కలిసి నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని, అర్హత ఉన్న వారందరూ పెన్షన్లకు నమోదు చేయించుకోవాలన్నారు.

కుట్టుమిషను శిక్షణ కేంద్రం తనిఖీ

చెరుకుపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని బీసీకార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా శిక్షణార్థుల హాజరు పరిశీలించారు. శిక్షణార్థులందరూ 90 శాతం హాజరు కలిగి ఉండాలన్నారు. బాగా నేర్చుకుని స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆశిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు నాగమణి, సెంటర్ నిర్వాహకురాలు భార్గవి, పంచాయతీ కార్యదర్శి ఈ.విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

కర్లపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పెనుమెత్స కోటంరాజు జూనియర్ కళాశాలలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని మహిళలు ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, బీజేపీ నాయకులు కరీముల్లా, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ బాజీ, వెంకటరామరాజు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు గ్రామపంచాయతీకి చెందిన షేక్ సలాంకు సంబంధించిన 6 ఎకరాల గడ్డి వామి శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సుమారు రూ.50 వేల ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. పొన్నూరు అగ్నిమాపకాధికారులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాధమాధవి

రికార్డుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి

● ఐసీడీఎస్ పీడీ రాధమాధవి

కొల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల రికార్డుల నిర్వహణపై కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ రాధమాధవి అన్నారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. సీడీపీవో విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, పిల్లల ఎత్తు, బరువులను నమోదు చేయాలన్నారు. ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించే ఈసీసీఈడీ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, తల్లులను ఆహ్వానించి ప్రీస్కూల్ పుస్తకాలను పరిచయం చేయాలన్నారు. కిషోరి బాలికలకు బాల్య వివాహాల గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. ప్రాజెక్టు సమావేశంలో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, ఫజరున్నీసా, అమృతవాణి, మాధవి, వెంకటరమణ, నగరాజకుమారి, శాంతిశ్రీ, శకుంతల, సునీత, సంపూర్ణ, మాణిక్యం, బిపిసి యోగలక్ష్మి, ఐదు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో కార్డెన్ అండ్ సెర్చ్‌లు : ఎస్పీ

బాపట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయటమే లక్ష్యంగా జిల్లాలో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలు నుంచి చీరాల, రేపల్లె సబ్‌డివిజన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్‌లు జరిగాయన్నారు. రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేమూరు, చుండూరు, రేపల్లెటౌన్, రూరల్ సీఐలు, భట్టిప్రోలు, నిజాంపట్నం, చోడాయిపాలెం, చుండూరు ఎస్‌ఐలు సబ్ డివిజన్ పరిధిలో 72 మంది పోలీసు సిబ్బంది కలిసి తనిఖీ చేసినట్టు తెలిపారు.



పోలీసుల స్వాధీనంలో ఉన్న పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు

వెల్లటూరులో 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఎస్సీ కాలనీలోని 80 మంది పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని గృహాలు, పరిసర ప్రాంతాలను తనిఖీలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా అనుమానాస్పదంగా ఉన్న 32 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ మీ పరిసరాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు నివాసం ఉంటున్నా, అనుమానాస్పదంగా సంచరిస్తున్నా దగ్గరలోని పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో లేదా 112, 100 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారు వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో వేమూరు, చుండూరు, రేపల్లె టౌన్, రూరల్ సీఐలు, భట్టిప్రోలు, చుండూరు, నిజాంపట్నం, సోడాయపాలెం ఎస్‌ఐలు, సబ్ డివిజన్ పరిధిలోని వివిధ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 72 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

కొల్లూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆటోను ట్రాక్టర్ ఢీకొనగా ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు గ్రామానికి చెందిన తన్నీరు శేషుబాబు (54) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గుంటూరు మిర్చి యార్డు నుంచి మిర్చిలోడుతో భట్టిప్రోలు చేరుకుని అక్కడ మిర్చి బస్తాలను దిగుమతి చేసి తిరిగి వెళుతుండగా కొల్లూరులోని కాళీకృష్ణ గుడి వద్ద తెనాలి వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శేషుబాబు తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అర్జున్ తెలిపారు.

విద్యుత్ బిల్లులు ఆదివారం చెల్లించవచ్చు

రేపల్లె, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో బిల్లు కలెక్షన్ కోసం తెరిచి ఉంటుందని పాతబకాయిలు, కరెంటు బిల్లులు చెల్లించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఏడీఈ వి.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

తొలగించారని.. కత్తిరిస్తున్నారు!

ఏపీ ఫైబర్ నెట్ సంస్థ మాజీ ఉద్యోగుల చర్యలతో.. తమకు తిప్పలు తప్పడం లేదని కేబుల్ ఆపరేటర్ల ఆరోపిస్తున్నారు. సంస్థ నుంచి తొలగించారనే ఆక్రోశంతో కొందరు ఉద్యోగులు కేబుల్ వైర్లను తరచూ కత్తిరించడం.. తమకు తలనొప్పిగా మారిందని వాపోతున్నారు. ప్రసారాల అంతరాయంతో.. వినియోగదారుల నుంచి ఒత్తిడి అధికమైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తామే స్వయంగా మరమ్మతులు చేపడుతున్నప్పటికీ.. మళ్లీ మళ్లీ ఇలాంటి దుశ్చర్యలకు ఉద్యోగులు పాల్పడడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ చర్యలతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని..ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నారు.

- ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ వైర్ల కత్తిరింపు
- సంస్థ మాజీ ఉద్యోగుల పనేనని ఆపరేటర్ల ఆరోపణ
- మరమ్మతులు చేపట్టినా మళ్లీ మళ్లీ అవే దుశ్చర్యలు
- వినియోగదారుల నుంచి ఒత్తిడి, ఆర్థిక నష్టం అంటూ ఆందోళన
- సంస్థ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- సీఎం దృష్టి సారించి పరిష్కరించాలంటూ వేడుకోలు

అమృతలూరు, ఏప్రిల్, 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్ ప్రసారాల అంతరాయానికి ప్రధాన కారణం సంస్థ నుంచి తొలగించిన సిబ్బందే కారణమని కేబుల్ ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు. సంస్థలో పని చేసిన అనుభవంతో ఏ కేబుల్ ఎటు వెళ్తుందో.. వారికి కొట్టిన పిండి అని, తమను విధుల నుంచి తొలగించారన్న ఆక్రోశంతో సిబ్బంది వైర్లు కత్తిరిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో రూ. లక్షలు పెట్టుబడి పెట్టి వినియోగదారులకు ప్రసారాలు అందిస్తున్న తాము.. నెల రోజులుగా ప్రసారాల్లో అంతరాయాలు ఏర్పడుతుండటంతో వినియోగదారుల నుంచి ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని కేబుల్ ఆపరేటర్లు వాపోతున్నారు.

పైగా తామే సంఘటితంగా తెగిపోయిన వైర్లను పునరుద్ధరిస్తున్నప్పటికీ మళ్లీమళ్లీ వైర్ల కత్తిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో బుధ, గురు వారాలు కత్తిరింపులకు గురైన ఏపీఎస్ ఎఫ్ఎల్ కేబుల్స్‌ను ఆయా పరిధిలోని కేబుల్ ఆపరేటర్లు సరిచేసి ప్రసారాలను పునరుద్ధరించారు. యథావిధిగా ప్రసారాలను వస్తున్నట్లు తెలుసుకున్న అగంతకులు చెరుకుపల్లి, కర్లపాలెం మధ్యన శుక్రవారం మధ్యాహ్నం వైర్లను కత్తిరించారు. తెనాలి నుంచి ప్రసారాలు ఈ కత్తిరింపులు వల్ల నిలిచిపోలేదుని గ్రహించిన దుండగులు.. తెనాలి సబ్ స్టేషన్ నుంచి వస్తున్న వైర్లను కూడా సాయంత్రం 6.30 గంటల మధ్యలో కత్తిరించారు. దీంతో వేమూరు, రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం, అమృతలూరు, చుం డూరు తదితర మండలాలకు ప్రసారాలు నిలిచిపోయాయి. దీంతో మళ్లీ కేబుల్ ఆపరేటర్లు అర్ధరాత్రి శనివారం తెల్లవారుజాము వరకు కష్టించి ప్రసారాలను పునరుద్ధరించారు.



అర్ధరాత్రి తెగిన ఏపీ ఎస్ఎఫ్ఎల్ వైర్లను స్ప్లైసింగ్ చేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

సంస్థ తొలగిస్తే ఆపరేటర్లను ఇబ్బంది పెడతారా?

ఏపీఎస్ఎఫ్ఎల్‌లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని ఆ సంస్థ తొలగిస్తే.. తమను ఇబ్బంది పెట్టడం ఏంటని కేబుల్ ఆపరేటర్ల ప్రశ్నిస్తున్నారు. తొలగించిన సిబ్బందికి సంస్థ బకాయి ఉంటే.. ఆ సొమ్మును రాబట్టుకునేందుకు ప్రసారాలు అంతరాయం కలిగించడం సబబు కాదని అంటున్నారు. కేబుల్ కత్తిరింపులకు పాల్పడే వారిని గుర్తించేందుకు ఆపరేటర్లు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీసీ కెమెరాలు డేటా సేకరణతో పాటు నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతు న్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రసారాల్లో అంతరాయాలు

సిబ్బంది తొలగింపు కారణంగానే.. ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం ఏర్పడుతున్నట్లుగా ఆయా జిల్లాల ఆపరేటర్లు ఏపీఎఫ్‌వోఎఫ్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఆపరేటర్ల సంఘం విజయవాడలోని సంస్థ కార్యాలయానికి వెళ్లి ఉన్న అధికారులతో తమ సమస్య లను చర్చించినట్లు తెలుస్తోంది. అయితే గత వారం వేమూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి మండలాల ఆపరేటర్లు కొంతమంది ఇదే సమస్యపై ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఏకరువు పెట్టగా అక్కడ ఉన్న సిబ్బంది చేతులెత్తేశారని చెబుతున్నారు. మరో నాలుగైదు నెలల వరకు ఆపరేటర్లు సిగ్నల్స్‌లో అం తరాయాలు లేకుండా చూసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. సంస్థ సిబ్బందిని నియమించుకునే వరకు ఈ తిప్పలు తప్పవని అంటున్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మానస పుత్రిక ఏపీఎస్ఎఫ్ఎల్ సంస్థ గత వైసీపీ ప్రభుత్వ ప్రారంభం నుంచి ప్రాభవం కోల్పోయింది. కూటమి ప్రభుత్వంలో సంస్థకు పునరుత్తేజం అందిస్తారని ఆ శించిన ఆపరేటర్లు తాజా పరిణామాలతో.. అసలు సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళ న వ్యక్తం చేస్తున్నారు. సీఎం మరోసారి దృష్టి సారించి సంస్థను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

ముగిసిన జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 18 నుంచి ప్రారంభమైన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో నంద్యాలకు చెందిన సిరివెళ్ల గుంపుంమాదిన్నె గ్రామానికి చెందిన కుందుల రాంగోపాల్‌రెడ్డి, పాణ్యం ఎస్.కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 3,994 అడుగులు లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. నంద్యాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, ఏఎస్‌పీ సుంకి సాకేత్‌రెడ్డి, సారికారెడ్డికి చెందిన ఎడ్లు 3,939 అడుగులు లాగి 2వ బహుమతి పొందాయి. ప్రకాశం జిల్లా టంగుటూరు, కృష్ణాజిల్లాకు చెందిన మేకా కృష్ణమోహన్, మక్కెన కోటేశ్వరరావులకు చెందిన ఎడ్లు 3,566 అడుగులు లాగి 3వ బహుమతి, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోటి శిరిషా చౌదరి, శివకృష్ణచౌదరి, గుంటూరుజిల్లా తాడేపల్లికి చెందిన లంకిరెడ్డి నిక్షత్‌రెడ్డికి చెందిన ఎడ్లు 4వ బహుమతి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలశౌరిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితాచౌదరి ఎడ్లు 3,176 అడుగులు లాగి 5వ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.1.25లక్షలు, 2వ బహుమతి రూ. లక్ష, 3వ బహుమతి రూ.75వేలును ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విరాళంగా అందజేశారు. 4వ బహుమతి రూ.65వేలును మురళీకృష్ణ గొర్రెల మండి కో-ఆపరేటివ్ సొసైటీ, 5వ బహుమతి రూ.55వేలు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, ఏనుగుపాలెం సర్పంచ్ మాదినేని అంజనేయులు అందజేశారు. పట్టణ సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు, నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ : మొదటి బహుమతిని కైవసం చేసుకున్న నంద్యాల జిల్లా ఎడ్లు

దాచేపల్లిలో ఉత్సాహంగా..

దాచేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి శ్రీ వీర్లంకమ్మ తల్లి ఆలయం 25వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న ఎడ్ల బల ప్రదర్శనలో శుక్రవారం పాల పళ్ల విభాగంలో పోటీలు నిర్వ హించారు. అమరావతి మండలం గిడుగు గ్రామా నికి చెందిన భూతి శ్రీనివాస్, నోసాయపేటకు చెందిన గౌరు కార్తికేయ ఎడ్ల జత 4,250 అడు గులు దూరం లాగి బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో మాచవరం మండలంలో మోర్జంపాడుకు చెందిన కొర్రి గంగారాజు యాదవ్ ఎడ్ల జత 3,609, మూడవ స్థానంలో ఫిరంగిపురం మండలం కంద్రికకు చెందిన కేలం పద్మ నాయుడు ఎడ్ల జత 3,580, బాపట్ల జిల్లా పాండు రంగాపురానికి చెందిన కె.ఏడుకొండలరెడ్డి ఎడ్ల జత 3,500, ఐదవ స్థానంలో పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలకు చెందిన యర్రంశెట్టి సుబ్బారావు ఎడ్ల జత, దాచేపల్లి గ్రామానికి చెందిన యామర్తి శైలేంద్ర 3,103 అడుగుల దూరం లాగి 6వ స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.20 వేలను రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఉడుముల కొండారెడ్డి, రెండవ బహుమతి రూ.15వేలు సలాం మేస్త్రి, కేసానుపల్లి జానయ్య, 3వ బహుమతి రూ.10వేలు కొప్పుల వెంకటేశ్వర్లు, గురజాల మల్లికార్జునరావు, నాల్గవ ప్రైజ్ రూ.8 వేలు యలమల రామ కోటయ్య, కుమారుడు వెంకటేశ్వర్లు నాగయ్య, 5వ ప్రైజ్ రూ.7వేలు గణితి అమరయ్య మామ చిమటా నాగేశ్వరరావు, 6వ ప్రైజ్ రూ.5వేలు కొప్పుల సీతారామయ్య విజేతలకు నగదుతో పాటు షీల్డ్ కూడా అందజేశారు. కాగా శనివారం జత పళ్ల విభాగంలో 20కి పైగా ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి.

పశువైద్యులు నిజంగా దేవుళ్లు

-పశువైద్య దినోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'మొన్న గుంటూరులో ఒక కోడె దూడకు ప్రమాదం జరిగింది. పశువైద్యులు స్పందించిన తీరు చాలా బాగుంది. నోరులేని జీవాల ఆర్తనాదాన్ని అర్థం చేసుకుని వైద్యం చేసే పశువైద్యులు నిజంగా దేవుళ్లు. మా నాన్న కూడా ఒక పశువైద్యుడు అయినందుకు నేను ఎప్పుడూ గర్వపడుతూ ఉంటాను.'అని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న జిల్లా పశుసంవర్థక శాఖ కార్యాలయంలో జరిగిన వరల్డ్ వెటర్నరీ డే కార్య క్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఒ.నరసింహారావు అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం ప్రజల ఆరోగ్యంతో అనుసంధానమై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పశువుల పట్ల ప్రేమ, బాధ్యత కలిగి ఉండాలని కోరారు. సమాజంలో పెంపుడు జంతువులతో పాటు వీధి కుక్కలు, పిల్లుల సంరక్షణకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పశుసంవర్థశాఖ జిల్లా అధికారి నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ పశు వైద్య దినోత్సం- 2025ను "పశు ఆరోగ్యం ఒక బృందం" అనే థీమ్ తో జరుపుకుంటున్నామని తెలిపారు. జంతువులకు అత్యున్నతస్థాయి సంరక్షణ, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి పశువైద్య బృందాలు, నిపుణులు కలిసి పనిచేయాలన్నదే ఈ థీమ్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వ పశు వైద్యశాలలో నూతన భవనాల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు ద్వారా రూ.14 లక్షలు కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీని పశు వైద్యశాలలోని వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ , డాక్టర్. ఎం.రత్నజ్యోతి, ప్రముఖ సర్జన్ లక్కింశెట్టి నాగేశ్వరరావు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ వై. ఈశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్. కె. సాంబశివరావ , జిల్లా పశు వైద్య వైద్యులు పాల్గొన్నారు.



గుంటూరు పాలీ క్లినిక్‌లో చికిత్స పొందుతున్న కోడెకు మేత పెడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

పోలీసుల అదుపులో బంగ్లాదేశీయుడు

- క్యాన్సర్ రోగికి సహాయకుడిగా వీసా తీసుకొని వ్యాపార కార్యకలాపాలు
- ఈ నెల 17న రోడ్డు మార్గంలో భారత్‌లోకి ప్రవేశం
- 21న గుంటూరుకు.. దుగ్గిరాలలో పసుపు కొనుగోలు
- లాడ్జిలు, హోటళ్ల తనిఖీల్లో బయటపడిన వ్యవహారం

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వీసా నిబంధనలకు విరుద్ధంగా గుంటూరులో ఉన్న బంగ్లాదేశీయుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కశ్మీరులోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తం కావడమే కాకుండా విదేశీయుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఉగ్రదాడితో పాటు వచ్చే నెల 2న ఏపీ రాజధానిలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్న విషయం తెలిసిందే. దీంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల మధ్య లాడ్జిలు, హోటల్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గుంటూరు నగరంలోనూ హోటళ్లు, లాడ్జిలను పోలీసులు జల్లెడ పట్టారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మస్తాన్ దర్గా ఎదురుగా ఉన్న సౌత్ ఇన్ హోటల్‌లో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించిన సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న బంగ్లాదేశీయుడిని అదుపులో తీసుకుని, విచారించారు. అతనితోపాటు మరికొందరు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారు కూడా ఉన్నారు. బంగ్లాదేశీయుడు రషీద్ (45)ను విచారించగా ఆయన వద్ద పాస్‌పోర్ట్, వీసా ఉన్నాయి. అయితే వీసా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది. అతను భారత్ నుంచి పసుపు, మిర్చి, ఉల్లిపాయలు వంటి వాటిని ఎగుమతి వ్యాపారం చేస్తుంటాడు. గతంలో నాలుగైదు సార్లు వ్యాపార కార్యకలాపాల నిమిత్తం భారత్‌కు వచ్చి వెళ్లాడు. ఇదే తరహాలో గతంలో రెండుసార్లు గుంటూరుకు వచ్చి వెళ్లాడు. బంగ్లాదేశ్‌కు చెందిన క్యాన్సర్ రోగికి సహాయకుడిగా వైద్య సేవల కోసం వస్తున్నట్లు వీసా తీసుకున్నాడు. చెన్నైలోని వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగికి వైద్యం చేయించాలని వీసా తీసుకొని.. ఈ నెల 17న రోడ్డు మార్గం ద్వారా రషీద్ భారత్‌లోకి ప్రవేశించాడు. అయితే అతనితో రోగి వచ్చారా లేదా అనేది తెలియరాలేదు. దీనిపై పోలీసు అధికారులు రషీద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు వచ్చి అక్కడ నుంచి కొందరు పసుపు వ్యాపారులను వెంటబెట్టుకొని ఈ నెల 21న గుంటూరు వచ్చాడు. వీసా నిబంధనల ప్రకారం ఆయన జిల్లాలోకి అడుగు పెట్టిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. అదే విధంగా ఆయన ఎక్కడైతే లాడ్జిలో బస చేస్తారో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రషీద్ ఇప్పటి వరకు స్పెషల్ బ్రాంచ్‌లో గాని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం ఇవ్వలేదు. కనీసం హోటల్ నిర్వాహకులు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. రషీద్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యాపారులతో కలిసి గుంటూరు జిల్లాలోని దుగ్గిరాలలో గల పసుపు యార్డుకు వెళ్లి పసుపు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అలాగే గతంలో కర్నూలు వెళ్లి ఉల్లిపాయలు కూడా కొనుగోలు చేసి ఎగుమతి చేసినట్లు విచారణలో తేలింది. పసుపు సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో మెడికల్ గ్రౌండ్స్‌లో అయితే త్వరగా వీసా వస్తుందనే ఉద్దేశంతో క్యాన్సర్ రోగికి సహాయకుడిగా వీసా తీసుకున్నట్లు రషీద్ చెప్పినట్లు తెలిసింది.

రషీద్ వ్యవహారంతో అప్రమత్తమైన నిఘావర్గాలు

ఒకవైపు కాశ్మీర్లో ఉగ్రదాడి.. మరోవైపు వచ్చేనెల 2న రాజధాని ప్రాంతంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో ఇప్పటికే నిఘా వర్గాలు అప్రమత్తమైన నేపథ్యంలో తాజాగా బంగ్లాదేశీయుడు పట్టుబడటం కలకలం రేపింది. ఇప్పటికే స్పెషల్ బ్రాంచ్ వర్గాలు జిల్లా వ్యాప్తంగా విదేశీయుల గురించిన వివరాలను తీస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోకి అత్యధికమంది ఎడ్యుకేషన్ వీసాపై వచ్చిన వారే ఉన్నారు. జిల్లాలోని కేఎల్, విజ్ఞాన్ యూనివర్సిటీలలో విదేశాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా యూనివర్సిటీలలో ఆఫ్రికా, నైజీరియా, సూడాన్, బంగ్లాదేశ్, ఇరాన్, ఇరాక్ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో నిఘా వర్గాలు వారందరి వీసాలను పరిశీలిస్తున్నారు. జిల్లాలో సుమారు 389 మంది విద్యార్థులు ఎడ్యుకేషన్ వీసాపై వివిధ దేశాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్నట్లుగా స్పెషల్‌బ్రాంచ్‌లో నమోదయింది. ఇప్పటికే పోలీసులు వారందరి వీసాలపై ఆరా తీస్తున్నారు. ఎడ్యుకేషన్ వీసాపై వచ్చి ఇతర కార్యకలాపాలు ఏమైనా చేస్తున్నారా అనే కోణంలోనూ విచారిస్తున్నారు. అయితే జిల్లాలో ఒక్కరు కూడా పాకిస్తానీయులు లేరని పోలీసు అధికారులు వెల్లడించారు. బంగ్లాదేశీయుడు రషీద్ భారత్‌లోకి కేవలం వ్యాపార దృష్టితోనే, అందులోనూ పాస్‌పోర్ట్, వీసాతోనే ప్రవేశించినప్పటికీ వచ్చిన పని కాకుండా మరో పని చేయడం, అంతేగాక ముందుగా సమాచారం ఇవ్వకపోవడాన్ని పోలీసులు తప్పుపడుతున్నారు.

స్థాయి దిగి.. దివ్యాంగునికి మంత్రి గౌరవం

తెనాలి రూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు తగిన గౌరవం ఇస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్లమనోహర్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ఓ దివ్యాంగుడి వద్దకు మంత్రి వెళ్లి నేలపైకూర్చుని అతడి సమస్యను సావధానంగా ఆలకించారు. అంతే కాకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. మంత్రి నన్న భావన లేకుండా సాధారణ మనిషిగా దివ్యాంగుడికి తగిన గౌరవం ఇచ్చిన తీరు అందిరినీ ఆకట్టుకుంది.



దివ్యాంగుని సమస్యను నేలపై కూర్చుని తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

15వ ఆర్థిక సంఘం నిధుల రాక

- ప్రధాని మోదీ పర్యటనకు ముందే కేంద్రం విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ. 120 కోట్లకు పైగా వచ్చే అవకాశం
- 70 శాతం నిధులు గ్రామ పంచాయతీలకే

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల ప్రజాపరిషత్తులు, జిల్లా పరిషత్తు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే శుక్రవారం అమరావతి రాజధాని పర్యటనకు రానుండటంతో కేంద్ర ప్రభుత్వం ముందుగానే వరాల జల్లు కురిపించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలను విడుదల చేసింది. దాదాపుగా రాష్ట్రం మొత్తానికి రూ. 1121. 20 కోట్లు విడుదల చేయడంతో అందులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ. 120 కోట్లు పైగానే వస్తాయని పంచాయతీరాజ్ జిల్లా అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. దాంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పెండింగ్ బిల్లులు చెల్లింపులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని చెబుతున్నాయి.

పంచాయతీలు, స్థానిక సంస్థలకు ప్రధానంగా కేంద్రం నుంచి విడుదలయ్యే నిధులే ఆధారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధులను కూడా పక్కదారి పట్టించింది. దాంతో పంచాయతీలు, మండల పరిషత్తలు, జిల్లాపరిషత్తు ఆర్థికంగా చితికిపోయాయి. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది ఆఖరులో ఒక దఫా ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో కొంతమేరకు ఉపశమనం లభించింది. తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, బ్లీచింగ్ కొనుగోళ్లు, పారిశుద్ధ్యం వంటి అవసరాలకు వినియోగించారు. రెండో విడత నిధుల విడుదల కోసం గత కొన్ని రోజుల నుంచి పంచాయతీరాజ్‌వర్గాలు ఎదురు చూస్తున్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాలంటే కొన్ని షరతులు ఉన్నాయి. ముఖ్యంగా పంచాయతీలు, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగి పాలకవర్గాలు పరిపాలిస్తుండాలి. ప్రధానంగా ఈ నిధులు బహిరంగ మల విసర్జన రహితంగా గ్రామాలను మార్చడం, చెత్త, వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాటు, వాటర్ రీసైక్లింగ్‌తో పాటు ఆరోగ్యం, విద్య, వ్యవసాయంలో సంస్కరణలు వంటి వాటికి ఖర్చు పెట్టుకొనే అవకాశం ఉన్నది. పంచాయతీలకు వసూలు జరిగే పన్నులు కేవలం నిర్వహణ, సిబ్బంది జీతాలకే సరిపోతుంటాయి. దీంతో ఏ పని చేయాలన్నా ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడుతుంటాయి. 70 శాతం నిధులు పంచాయతీలకు, 20 శాతం నిధులు మండలపరిషత్తులు, 10 శాతం నిధులు జిల్లాపరిషత్తుకు విభజిస్తారు. వచ్చే వారంలోనే ఆయా సంస్థల ట్రెజరీలకు నిధులు జమ అవుతాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. దీంతో పంచాయతీల్లో పెద్దఎత్తున మళ్లీ పనులు జరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

అల్లరి మాయం.. సెల్ మయం

(5వ పేజీ తరువాయి)

మానసిక వైద్య నిపుణులు చెప్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్నారులు కూడా సెల్‌ఫోన్లకు బానిసలయ్యారు. పైగా తమ పిల్లవాడు అల్లరి చేయకుండా బుద్ధిగా ఉంటాడని వాడికి ఫోను ఉంటే చాలని తల్లిదండ్రులే గొప్పగా చెప్పుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏడిస్తే.. అన్నం తినకపోతేనే చేతికి ఫోన్లు ఇవ్వడం మానేసి ఎత్తుకు తిప్పుతూ బయట ప్రపంచాన్ని పరిచయం చేయాలి. ఖాళీ సమయాల్లో వారిని ఇతర పిల్లల మధ్యలో గడిపేలా చేయాలి. అల్లరి అనేది పిల్లలకు ఏది తినాలో, వేటితో ఆడుకోవాలో, చేతుల్లోనివి ఇతరులకు పంచడం, చిన్న వ్యూహాలు వంటి విషయాలను నేర్పుతుంది. ఇలాంటి చర్యల వల్ల మెదడులో అన్ని నాడీకణాలు చురుగ్గా పనిచేస్తాయి. మట్టిలో ఆడుకున్నా ఏ ప్రమాదం ఉండదని మన బాల్యం మనకు నేర్పిన సంగతులు పిల్లలకు అర్థమయ్యేలా చేయాలి.


ఇలా గుర్తించాలి..

ఒత్తిడికి లోనైన పిల్లల ప్రవర్తన వయస్సుల వారీగా విభిన్నంగా ఉంటుంది. స్క్రీన్‌టైమ్‌కు బానిసలై ఒత్తిడికి లోనైన మూడేళ్ల నుంచి ఆరేళ్ల మధ్యవయస్సు గలిగిన పిల్లలు తమకు బాగా దగ్గరివారిని, ఇష్టమైన వస్తువులను అలాగే పట్టుకుని కూర్చుంటారు. ఈ ప్రవర్తన సాధారణం కంటే భిన్నంగా ఉంటుంది. ఆహారం తీసుకోవడం, నిద్రపోయే సమయాల్లో కూడా వేళలు పాటించరు. ఒక్కోసారి నిద్రలో లేని కాసేపు నవ్వడమో.. ఏడవడమో చేసి ఆ తర్వాత తిరిగి నిద్రకు ఉపక్రమిస్తారు. ఎక్కువ భయపడటం, మారం చేయడం, పెద్దవారితో వాదించడం, ఆటలు ఆడకపోవడం వంటి లక్షణాలు కనబడితే జాగ్రత్త పడితే మంచిది.

పెద్దల్లో నెలకొన్న భయాలు

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, కిడ్నాప్‌లు వంటి భయాలతో చాలామంది తల్లిదండ్రులు పిల్లలను బయటకు తీసుకురావడానికి బయపడి ఇంటికే పరిమితం చేస్తున్నారు. బయటకు తీసుకెళ్లిన సమయంలో పిల్లల అల్లరి చూడటానికి కూర్చోగలం గాని వారిపై దాడి జరుగుతుందన్న భయంతో కూర్చోలేం గదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న ఘటనలు చూసి అసలు వారికి ఏ వయస్సు నుంచి రక్షణ కల్పించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తమ పిల్లలు ఇతర పిల్లలతో కలసి ఆడుకోవాలని తమకు ఉంటుందని కానీ ఏ సమయంలో ఏం జరుగుతుందో అని అర్థం గాక ఇంట్లోనే ఉంచుకుంటున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు.


సమాజంతో మమేకం కావాలి



ఊహ తెలిసిన నాటి నుంచి పిల్లలకు సమాజంతో సంబంధాలు ఏర్పరచాలి. జ్ఞానాన్ని సంపాదించాలంటే సమాజంతో మమేకం తప్ప మరే మార్గం లేదు. టీవీలకు అతుక్కుపోతున్నారు అనుకునే లోపే జీవితాల్లోకి ఫోన్లు, ట్యాబ్‌లు వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత తరానికి ఇవి శాపంలా మారాయి. వీటి వల్ల అంత చిన్న పిల్లలకు పెద్దగా ఒరిగేది ఏమి లేకపోయినా శారీరక, మానసిక వ్యాధుల భారిన పడతారు. పెద్దలకు, సమాజానికి దూరంగా ఉంటారు. ఊబకాయం, తలనొప్పి, కంటి చూపు మందగించడం వంటి వాటి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

-డాక్టర్ బీ సతీష్‌కుమార్, సివిల్ సర్జన్, ఆర్ఎమ్‌వో జీజీహెచ్ గుంటూరు

పెద్దలే కారణం



పిల్లల్లో నెలకొన్న సమస్యలకు పెద్దవారే కారణం. మానసిక, ఉద్వేగాత్మక సంతోషం, సత్సంబంధాలు కొరవడిన కుటుంబం జైలు లాంటిది. వస్తు సంపద కోసం వెచ్చించడం మాని పిల్లలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. చిన్న వయస్సులో ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌కు దూరం చేయాలి.

-డాక్టర్ వీ వెంకటకిరణ్ మానసిక వైద్య నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు వైద్య కళాశాల

అవీ.. ఇవీ..

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న హిందూసేన

పంగులూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా మండల హిందూసేన ఆధ్వర్యంలో శనివారం రాత్రి పంగులూరులో కొవ్వొత్తులతో నిరసనర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్ర మాటాడుతూ పహల్గామ్‌లో లష్కరేతోయిబా ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతి భారతీయుడు ముక్త కంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదులను కాశ్మీర్ నుండి తరిమి వేయడంతో పాటు కాశ్మీర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో నందవరపు పీర్‌సాహెబ్, కందుకూఱి మల్లికార్జునరావు, రత్తయ్య చౌదరి, కరీముల్లా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ బాలుడు మృతి

అద్దంకి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి చికిత్స పొందుతున్న బాలుడు కొడవటిగంటి భరత్(10) శనివారం ఒంగోలు రిమ్స్ లో మృతి చెందాడు. మండలంలోని వెంపరాల కు చెందిన స్వర్ణలత ను మార్కాపురం మండలం రాజుపాలెం చెందిన పుల్లారావు కు ఇచ్చి వివాహం చేశారు. స్వర్ణలత రెండవ కాన్పు కు పుట్టిల్లు అయిన వెంపరాల రావటంతో తల్లి తో పాటు భరత్ కూడా వచ్చాడు. ఈ నేపథ్యంలో శు క్రవారం ముగ్గురు పిల్లలు చెరువు వద్ద కు వెళ్లారు. భరత్ జారి చెరువులో పడటంతో గొ ర్రెల కాపరులు గమనించి బయటకు తీసి 108 వాహనం లో అద్దంకి వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. రిమ్స్ లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం వచ్చినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

వెంపరాలలో ఉపాధి కూలీ మృతి

అద్దంకి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో శనివారం ఉపాధి పనులకు వెళ్లిన కూలీ గరిగెల దాసు(గుండెపోటుతో మృతి చెందాడు. ఫారంపాండ్ పనులకు వెళ్లిన దాసుకు గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో తోటి కూలీలు 108 కు సమాచారం అందించారు. వైద్యచికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని మేట్ వజ్జా బ్రహ్మయ్య ఎంపీడీవో శింగయ్యకు సమాచారం అందించారు.

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● వేటపాలెంలో డ్రోన్ కెమెరాతో పలు వాహనాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నేర నియం త్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నారు. సాంకే తికపరంగా మరింత ముందుకు సాగుతూ డ్రోన్ కెమెరాతో వాహనాలు గుర్తిస్తు న్నారు. ఈ నేపథ్యం లోనే శనివారం వేటపాలెం - పావూరు రోడ్డు జంక్షన్‌లో డ్రోన్ కెమెరాతో సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు పలు వాహనాలు తనిఖీలు చేశారు. అనుమానిత వాహనాలను స్టేషన్‌కు తరలించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఇంకొల్లు, ఏప్రిల్ 26,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడుపులపాడు గ్రామ పరిధిలో పేకాట శిబిరంపై ఇంకొల్లు ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు.పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.1850లు నగదును స్వాధీన పరుచుకున్నారు.

1,326 బంగారు కుటుంబాల గుర్తింపు

అద్దంకి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1326 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. ఆయా గ్రామాలలో సచివాలయ సిబ్బంది ద్వారా పీ-4 సర్వే ద్వారా 1,326 బంగారు కుటుంబాలు గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి 5 నుండి 7 బంగారు కుటుంబాలకు ఒక మార్గదర్శిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మార్గదర్శి కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవగాహన కల్పించేందుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్గదర్శి పనిచేసేందుకు వారికినచ్చిన కుటుంబాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకిఏ ప్రిల్26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణం లోని 8వ సచివాలయాన్ని శనివారం ఉదయం కమిషనర్ రవీంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మెయిన్ సైడ్ డ్రైన్‌లలో జరుగుతున్న పూడికతీత పనులు, కుట్టుశిక్షణ కేంద్రం, సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ ల నిర్మాణ పనులు పరిశీలించారు.

రేపు పొగాకు రైతుల సదస్సు



సమావేశమైన రైతుసంఘం నాయకులు

ఇంకొల్లు, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులు వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండు చేస్తూ ఇంకొల్లులో ఈ నెల 28న నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు కోరారు. ఇంకొల్లు, సంతరావూరు రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతం లోని పొగాకు రైతులు అందరూ ఇంకొల్లులో జరగనున్న సదస్సుకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాట ఇచ్చారు..నెరవేర్చారు

● మత్స్యకారులకు అందిన భరోసా ● ఆనందంలో గంగపుత్రుల కుటుంబాలు



మత్స్యసంపద ఇతర ప్రాంతాలకు లోడ్ చేస్తున్న మత్స్యకారులు(ఫైల్‌ఫోటో)

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గంగ పుత్రులకు టీడీపీ కూటమితో భరోసా లభించింది. గత ప్రభుత్వం హయాంలో మత్స్యకార భరోసా రూ.10 ప్రకటించి అందులోనూ అనేక కోతలు విధించారు. పైగా అర్హులకు సక్రమంగా భరోసా అందక నానాయాతన పడ్డారు. ఈ క్రమంలో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం గంగ పుత్రుల కుటుంబాలు కన్నీళ్లు తీరుస్తామని, వేట నిషేధిత సమయంలో అందాల్సిన భరోసాను రూ.20 వేలు చేస్తూ ప్రకటన చేసింది. మాట ఇచ్చిందే తడవుగా శనివారం శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని మత్స్యకారుల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనేపథ్యంలోనే మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.20 వేలు జమ అయ్యాయి. దీంతో చీరాల పరిధిలోని మత్స్యకారులు ఆనందాలు విరభూశాయి. నియోజకవర్గంలో సుమారు 2వేల మంది అర్హులు ఉన్నారు. దీంతో 'మాట ఇచ్చారు. నెర వేర్చారు...థాంక్యూ సీఎం' అంటూ నినదించారు. అయితే గత ప్రభుత్వం హయాంలో భరోసా అందక అవస్థలు పడిన గంగపుత్రులకు శనివారం తీపి కబురు అందడంతో ఆనందాల్లో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 12,671 మంది మత్స్యకారులుండగా దీనికి సంబంధించి రూ.25.34 కోట్లు విడుదలయ్యాయి.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

చినగంజాం : సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలో భాగంగా మత్స్య కారులకు లబ్ధిచేకూరడంతో మండల పరిధిలోని టీడీపీ మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల బీసీ సెల్ అధ్యక్షులు వాటుపల్లి ఏడుకొండలు అధ్యక్షత శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ మండల పరిధిలో అత్యధికంగా మత్స్యకార గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. మండల పరిధిలో 1090 మంది మత్స్యకారులకు సముద్ర వేట నిషేద సమయంలో ఇచ్చే భృతి రూ.20,000లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య, అబ్దుల్‌కలాంఅజాద్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, మత్స్యకార, బీ.సీ సెల్ నాయకులు, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది మాకు చక్కని భరోసా



రెండేళ్లుగా భరోసా అందక మత్స్యకార కుటుంబాలు పరిస్థితి దయనీయంగా ఉన్నాయి. అయితే టీడీపీ కూటమి ప్రకటించిన మాదిరిగా శనివారం బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఇదిమాకు చక్కని భరోసా

కొండబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు

గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రణాళిక

పారిశ్రామికవేత్త, లాయిడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ విక్రం నారాయణరావు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విక్రం నారాయణరావు, గ్రామస్థులు

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : గొనసపూడి గ్రామంలోని ప్రతి ఇంటిని భాగస్వాములుగా చేసుకుంటూ గ్రామాన్ని ధనిక గ్రామంగా మార్చడమే తన లక్ష్యమని ప్రముఖ పారిశ్రామికవేత్త, లాయిడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ విక్రం నారాయణరావు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహ ఆవరణలో టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన గ్రామ ప్రజల అభివృద్ధి ప్రణాళిక బ్రోచర్‌ని గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సభలో నారాయణరావు మాట్లాడుతూ తను పుట్టి పెరిగిన గ్రామం మీద అపరిమితం అయిన ఇష్టంతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో గత రెండు సంవత్సరాల నుంచి తోటి గ్రామస్థులతో అనేక సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారాన్ని మిళితం చేస్తూ గ్రామంలో భూములున్న ప్రతి ఒక్కరిని వ్యాపార భాగస్వాములుగా చేసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యోద్దేశ్యమన్నారు. కొత్తకాలువ దిగువ పొలం, కొమ్మమూరు కాలువదిగువ పొలం, అప్పేరు వాగు, డ్రైనేజీ వాగుకి హద్య ఉన్న సుమారు 600 కుటుంబాలకు సంబంధించిన వెయ్యి ఎకరాల భూమిని సేకరించి, అందులో యూనివర్శిటీ, గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్, హోటల్స్, ఇండిస్ట్రియల్ పార్క్, మినీ ఫిలింసిటీ, విల్లాలు, బహుళ అంతస్తుల భవన సముదాయ నిర్మాణాలు, మల్టీస్పెషాలటీ హాస్పిటల్స్, ఆర్గానిక్ వ్యవసాయంను మిళితం చేస్తూ కొన్ని వేల మందికి విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. భూమి ఇచ్చిన ప్రతి రైతుకి లబ్ది చేకూరతుందని, వారిని వాటాదారులుగా తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

● ఎస్పీ ఆదేశాలతో కదిలిన పోలీసు యంత్రాంగం

● అనుమానితులపై ప్రత్యేక దృష్టి



సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్ఐ

పర్చూరు/కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు, కారంచేడు మండలాల్లో శనివారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. అందులో భాగంగా కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో పోలీసు సిబ్బంది ఆయా ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీచేశారు. వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు పోలీసులు పాల్గొన్నారు.

వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

ఇంకొల్లు : వాహదారులు సరైనపత్రాలు కలిగి ఉండాలని లేకుంటే వారిపై కేసులు నమోదు చేసి తగుచర్యలు తీసుకుంటామని ఇంకొల్లు సీఐ వై.వి రమణయ్య అన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషారుడూడి ఆదేశాల మేరకు ఇంకొల్లు ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించారు. బస్టాండు,ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు సూచనలు చేశారు. వాహనాలకు వాహనం నడుపువారికి లైసెన్సులు తప్పకుండా పొంది ఉండాలని సూచించారు. ప్రయాణికులు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పర్చూరు రోడ్డు,కోణికి రోడ్డులో ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం



అరుణను సన్మానిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు ఉగాది పురస్కార గ్రహీతలను సృజన ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనం సత్కరించి సన్మానించారు. స్థానిక కాళికా సమేత కమలేశ్వరస్వామి దేవాలయం ఆవరణలోని సృజన మండపంలో ముందుగా టెర్రరిస్టుల తూటాలకు బలైన యాత్రికులకు నివాళులు అర్పించారు. ఇటీవల మృతి చెందిన సాహిత్య వేత్తలు లక్ష్మణమూర్తి, ముంగర జాషువాలకు నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కవయి త్రి తేళ్ల అరుణ, కవులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వదలి రాధాకృష్ణ, డాక్టర్ నూనె అంకమ్మరావులను సృజన ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహిత్యవేత్తలు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, సందిరాజు విజయకుమార్, కొండారెడ్డి, చంద్రమోహన్, సృజన, రోటరీక్లబ్ శింగరకొండ, పలు ప్రజాసంఘాల బాధ్యులు దివాకరదత్, చప్పిడి వీరయ్య, వారణాసి రఘురామ శర్మ,పాలపర్తి జ్యోతిష్మతి, లక్కరాజు శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ దేవపాలన, నిమ్మరాజు నాగేశ్వరరావు, మారం కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, పసుమర్తి కోటయ్య, నారాయణం బాలసు బ్రహ్మణ్యం,సందిరెడ్డి శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, జాగర్లమూడి ప్రతాప్, ఆర్ రాఘవరెడ్డి, రాఘవరావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జాతీయ నాటకోత్సవాలు



నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి మిత్రమండలి చీరాల వారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టణంలోని కేజీఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక మిత్ర మండలి ప్రతినిధులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈక్రమంలో రాయని హనుమంతురావు కళావేదిక ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం వర్క్ ఫ్రమ్ హోం హాస్య నాటిక ప్రదర్శించారు. ఆయా పాత్రల్లో కళాకారులు, చిన్నారులు విశేషంగా నటించి అందరిని అలరించారు. అలాగే ఈనెల 30వ తేదీ వరకు ప్రదర్శనలు ఉన్నట్లు ప్రతినిధులు వివరించారు.



శ్రీరామ పట్టాభిషేకంలో సీతారాములు

కిరాయి హంతకులు హైదరాబాదీయులా?

● ఒంగోలులో వారంరోజులు మకాం

● బాయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరిని హత్య చేసేందుకు కిరాయి హంతకులు ఒంగోలులో వారం రోజులు మకాం వేసినట్లు తెలుస్తోంది. నలుగురు వ్యక్తులు ఒంగోలులోని ఓ హాస్టల్‌లో వారంరోజులు పాటు ఉండి వీరయ్యచౌదరి హత్యకు రెక్కీ నిర్వహించారనే నిర్ధారణకు పోలీసులు వచ్చారు. అదేక్రమంలో ఇసుక వ్యాపారి ఆదేశాల మేరకు ఆ నలుగురికి అవసరమైన సదుపాయాలు ఓ యువకుడు చూశాడు. వారికి అవసరమైన భోజనం, టిఫిన్ ను అందజేశాడు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అంతేకాకుండా హత్య జరిగిన అనంతరం కూడా నిందితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలుస్తోంది. వారి కోసం పోలీసు బృందాలు హైదరాబాద్ వెళ్లి గాలింపు చర్యలు చేపడుతున్నాయి. అంతేకాకుండా ఈ హత్యకు సంబంధించి కీలక సూత్రదారులు ఎవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ కేసులో కీలకంగా మారిన ఇసుక వ్యాపారి దొరికితే సూత్రధారులు ఎవరు పాత్రధారులు ఎంతమంది అనే సమాచారం తెలుస్తుంది.

పోలీసుల అదుపులో వైసీపీ నాయకుడు

నాగులుప్పలపాడు మండలానికి చెందిన కీలక వైసీపీ నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో మండలాన్ని శాసించిన సదరు నాయకుడు ఒంగోలు నివాసం ఉంటాడు. అయితే హత్యకు సంబంధించి కీలక అనుమానితుడైన రేషన్ మాఫియా డాన్‌కు ఆ నాయకుడికి మంచి సంబంధాలు ఉన్నాయి. దాంతో ఆ నాయకుడిపై అనుమానాలు రావడంతో అతనిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ఏడుగురు తహసీల్దార్ల బదిలీ



ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏడుగురు తహసీల్దార్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వారిలో నలుగురిని పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న ఇరువురికి అడ్‌హక్ ఉద్యోగోన్నతులు కల్పించారు. మూడు నెలల క్రితం సస్పెండ్ అయిన కనిగిరి తహసీల్దార్‌కు తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. సీఎస్‌పురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.మంజునాథరెడ్డిని ఎర్రగొండపాలెం, మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న కె.రవీంద్రారెడ్డిని సీఎస్‌పురం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్.నారాయణరెడ్డిని మద్దిపాడు తహసీల్దార్‌గా, దొనకొండలో పనిచేస్తున్న జగదీశ్వరరావును కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ జిల్లా ఆడిట్ సూపరింటెండెంట్‌గా నియమించారు. కనిగిరి తహసీల్దార్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన సిహెచ్.అశోక్‌కుమార్‌రెడ్డిని పెండింగ్ విచారణ కింద రాచర్ల తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హెచ్ఎంపాడులో డీటీగా పనిచేస్తున్న కె.కిషోర్‌కుమార్‌ను అడ్‌హక్ ఉద్యోగోన్నతిపై తర్లుపాడు, పొన్నలూరు డీటీగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును పుల్లలచెరువు తహసీల్దార్‌గా నియమించారు.

జేఈఈ కోచింగ్‌కు ఏకలవ్య విద్యార్థులు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్య ఆదర్శ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఢిల్లీ వెళ్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ శనివారం తెలిపారు. కళాశాలకు చెందిన సీహెచ్ నాగలక్ష్మి, బీ మల్లీశ్వరిబాయి, ఎం.అనూబాయి, డీ అనూషబాయి కేంద్ర సంస్థ ఎన్ఈఎస్‌టీ న్యూఢిల్లీ నిర్వహిస్తున్న జేఈఈ అడ్వాన్స్‌డు ప్రత్యేక శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

అల్లరి మాయం.. సెల్ మయం

(5వ పేజీ తరువాయి)

మానసిక వైద్య నిపుణులు చెప్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్నారులు కూడా సెల్‌ఫోన్లకు బానిసలయ్యారు. పైగా తమ పిల్లవాడు అల్లరి చేయకుండా బుద్ధిగా ఉంటాడని వాడికి ఫోను ఉంటే చాలని తల్లిదండ్రులే గొప్పగా చెప్పుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏడిస్తే.. అన్నం తినకపోతేనే చేతికి ఫోన్లు ఇవ్వడం మానేసి ఎత్తుకు తిప్పుతూ బయట ప్రపంచాన్ని పరిచయం చేయాలి. ఖాళీ సమయాల్లో వారిని ఇతర పిల్లల మధ్యలో గడిపేలా చేయాలి. అల్లరి అనేది పిల్లలకు ఏది తినాలో, వేటితో ఆడుకోవాలో, చేతుల్లోనివి ఇతరులకు పంచడం, చిన్న వ్యూహాలు వంటి విషయాలను నేర్పుతుంది. ఇలాంటి చర్యల వల్ల మెదడులో అన్ని నాడీకణాలు చురుగ్గా పనిచేస్తాయి. మట్టిలో ఆడుకున్నా ఏ ప్రమాదం ఉండదని మన బాల్యం మనకు నేర్పిన సంగతులు పిల్లలకు అర్థమయ్యేలా చేయాలి.

ఇలా గుర్తించాలి..

ఒత్తిడికి లోనైన పిల్లల ప్రవర్తన వయస్సుల వారీగా విభిన్నంగా ఉంటుంది. స్క్రీన్‌టైమ్‌కు బానిసలై ఒత్తిడికి లోనైన మూడేళ్ల నుంచి ఆరేళ్ల మధ్యవయస్సు గలిగిన పిల్లలు తమకు బాగా దగ్గరివారిని, ఇష్టమైన వస్తువులను అలాగే పట్టుకుని కూర్చుంటారు. ఈ ప్రవర్తన సాధారణం కంటే భిన్నంగా ఉంటుంది. ఆహారం తీసుకోవడం, నిద్రపోయే సమయాల్లో కూడా వేళలు పాటించరు. ఒక్కోసారి నిద్రలో లేని కాసేపు నవ్వడమో.. ఏడవడమో చేసి ఆ తర్వాత తిరిగి నిద్రకు ఉపక్రమిస్తారు. ఎక్కువ భయపడటం, మారం చేయడం, పెద్దవారితో వాదించడం, ఆటలు ఆడకపోవడం వంటి లక్షణాలు కనబడితే జాగ్రత్త పడితే మంచిది.

పెద్దల్లో నెలకొన్న భయాలు

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, కిడ్నాప్‌లు వంటి భయాలతో చాలామంది తల్లిదండ్రులు పిల్లలను బయటకు తీసుకురావడానికి బయపడి ఇంటికే పరిమితం చేస్తున్నారు. బయటకు తీసుకెళ్లిన సమయంలో పిల్లల అల్లరి చూడటానికి కూర్చోగలం గాని వారిపై దాడి జరుగుతుందన్న భయంతో కూర్చోలేం గదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న ఘటనలు చూసి అసలు వారికి ఏ వయస్సు నుంచి రక్షణ కల్పించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తమ పిల్లలు ఇతర పిల్లలతో కలసి ఆడుకోవాలని తమకు ఉంటుందని కానీ ఏ సమయంలో ఏం జరుగుతుందో అని అర్థం గాక ఇంట్లోనే ఉంచుకుంటున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు.

సమాజంతో మమేకం కావాలి

ఊహ తెలిసిన నాటి నుంచి పిల్లలకు సమాజంతో సంబంధాలు ఏర్పరచాలి. జ్ఞానాన్ని సంపాదించాలంటే సమాజంతో మమేకం తప్ప మరే మార్గంలేదు. టీవీలకు అతుక్కుపోతున్నారు అనుకునే లోపే జీవితాల్లోకి ఫోన్లు, ట్యాబ్‌లు వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత తరానికి ఇవి శాపంలా మారాయి. వీటి వల్ల అంత చిన్న పిల్లలకు పెద్దగా ఒరిగేది ఏమి లేకపోయినా శారీరక, మానసిక వ్యాధుల భారిన పడతారు. పెద్దలకు, సమాజానికి దూరంగా ఉంటారు. ఊబకాయం, తలనొప్పి, కంటి చూపు మందగించడం వంటి వాటి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

డాక్టర్ జీ సతీష్‌కుమార్,
సివిల్ సర్జన్, ఆర్ఎమ్‌వో జీజీహెచ్ గుంటూరు

పెద్దలే కారణం

పిల్లల్లో నెలకొన్న సమస్యలకు పెద్దవారే కారణం. మానసిక, ఉద్వేగాత్మక సంతోషం, సత్సంబంధాలు కొరవడిన కుటుంబం జైలు లాంటిది. వస్తు సంపద కోసం వెచ్చించడం మాని పిల్లలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. చిన్న వయస్సులో ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌కు దూరం చేయాలి.

వి.వెంకటకిరణ్, మానసిక వైద్య నిపుణుడు,
అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు వైద్య కళాశాల

అవీ..ఇవీ..

భూసార పరీక్షలతో పంట దిగుబడి అంచనా



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

తోటవారిపాలెం(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో పంట దిగుబడి అంచనా వేయవచ్చని ఏవో సుమతి పేర్కొన్నారు. శనివారం తోటవారిపాలెం గ్రామంలో సిబ్బందితో కలిసి భూసార పరీక్షలు నిర్వహించారు. అలాగే వేసవిలో మెట్ట పంటలను పరిశీలించి వ్యవసాయ పురుగు నివారణ చర్యలను వివరించారు. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీతో పనిముట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో ప్రయాణికులకు మేలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌లో చలివేంద్రాలు ఏర్పాటు ద్వారా ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందని వన్‌టౌన్ సీఐ సురేష్‌బాబు సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం కేజేఎం స్కూల్ సమీపంలోని మహాలక్ష్మమ్మ చెట్టు సమీపంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మే 31 వరకు మజ్జిగ పంపిణీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, నారాయణమూర్తి, రమేష్, సుభాషిణి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పహల్గాంలో ఉగ్రదాడి అత్యంత హేయం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక ప్రజానీకాన్ని 28 మందిని హత మార్చిన దుర్ఘటన అత్యంత హేయమని చీరాల చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా శనివారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎంజీసీ మార్కెట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా గడియార స్తంభం కూడలికి చేరుకుని మానవహారం నిర్వహించారు. మధ్యాహ్నం యధావిధిగా దుకాణాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తులాబందు రామకృష్ణ, సిన్ని లీలాధరరావు, వేముల చంద్రశేఖర్, శీరం వేణుగోపాల్, శ్రీమన్నారాయణ, కిషోర్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో...

అద్దంకి : జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయటం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మస్తాన్ బ్రహ్మయ్యలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) అద్దంకి శాఖ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జమ్ముకశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ బొమ్మ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు దర్శవరపు దుర్గాప్రసాద్, గద్దమడుగు మురళి, సరికొల్లి నాగేశ్వరరావు, అడుసుమల్లి సోమా శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, చిక్కాల కొండలరావు, మండా వేలు, రావూరి శ్రీనివాసరావు,దూళిపాళ్ల శివ, పణికుమార్, అనిల్, శింగయ్య, విష్ణు, హరికృష్ణ, శామ్యూల్, విజయ్, ప్రజా సంఘాల నేతలు శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం


చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నెం.20 ప్రకటించిందని తద్వారా సులభంగా, వేగంగా భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు అందుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులకు సంబంధించి, అలాగే ఐబీఐ, డిప్లమా, బీటెక్ అర్హతలు ఇంజనీర్, సర్వేయర్‌లకు లైసెన్సుల పొందేందుకు కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ విభాగంలో సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

మార్టూరు,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్టూరు ప్రాంత ప్రజానీకం ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

దళిత కాలనీలోని పాఠశాలలను కాపాడండి

● ఎంఈవోకు ఎస్సీకాలనీవాసుల వినతి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న బొప్పేపల్లి ఎస్సీకాలనీ వాసులు

మార్టూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దళిత కాలనీల్లోని పాఠశాలలను నిర్వీర్యం చేయరాదని మండల మాదిగ ఉద్యోగుల సమాఖ్య కోరింది. శనివారం మండలంలోని బొప్పేపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీ వాసులు మార్టూరులో ఆ మేరకు ఎంఈవో వస్రానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెలువడిన జీవో నంబరు 117ను అమలుచేయగా ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం 117 జీవోను సవరణ చేయగా ఉన్నతపాఠశాలల్లో కలిపిన 3, 4, 5 తరగతులను యధావిధిగా పూర్వస్థితి ప్రాథమిక పాఠశాలల్లోకి చేర్చాలన్నారు. కానీ మండలంలోని బొప్పేపల్లి ఎస్సీ ప్రాథమిక పాఠశాలకు ఉన్నత పాఠశాల నుండి రావలసిన3, 4, 5 తరగతులను రానివ్వకుండా చేస్తున్నారన్నారు. ఈ విషయమై పూర్వ స్థితిలో విచారించి, దళితవాడల్లోని పాఠశాలలను బతికించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే బంగారుబాల్యం

● అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ్ పక్షోత్సవాలపై జోరుగా ప్రచారం ● పక్కాగా అమలు చేస్తే అన్నింటిలో మిన్న



అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులు

చీరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తల్లులు, పిల్లలు ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్షా మాసోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుండి 22 వరకు నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీల్లో ఉన్న పిల్లలకు ఆరోగ్యం అందించే విధంగా పోషకాలు ఇవ్వడమే కాకుండా, 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా కృషి చేయాలని ఇప్పటికే అధికారులు సూచించారు.

జిల్లా 1,888 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా అంగన్‌వాడీకేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులను గుర్తించి పాఠశాలలో చేరే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలే పర్యవేక్షించాల్సి ఉంది. పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొన్న చిన్నారులపై దృష్టిసారించి ఇప్పటికే సంబంధిత సిబ్బంది ఎలిమెంటరీ స్కూళ్లలో ప్రవేశాలకు ప్రచారాలు ప్రారంభించారు.

తల్లిదండ్రుల అయిష్టత

అయితే కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి, బిడ్డల పట్ల పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం ఉంటోంది. వారి పర్యవేక్షణలో చిత్తశుద్ధి లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థలపై మక్కువ చూపుతున్నారు. దీంతో ఆటపాటలతో సాగాల్సిన చిన్నారుల బాల్యం ఒత్తిడితో సాగుతోంది. విద్యాభ్యాసంలో యాంత్రికత పిల్లలకు భవిష్యత్తులో మానసిక రుగ్మతలను తెచ్చిపెడుతోంది. తద్వారా ఆటపాటలు లేక నక్షత్రమైన ఆహారం అందక చిన్నతనంలో బాలలు అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు. ఈక్రమంలో ఇటీవల అధికారులు ప్రజా ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రెండు రకాల యాప్‌లను అందుబాటు లోకి తెచ్చారు. మహిళల గర్భం దాల్చిన నాటి నుంచే తల్లి, బిడ్డల ఆరోగ్యంపై దృష్టిసారించారు. అలాగే ఐదేళ్ల పిల్లలను కూడా ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూళ్లకు చేర్పి విద్యతో పాటు ఆరోగ్యం ఉండాలనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు

ప్రభుత్వం నుండి తల్లి, బిడ్డలకు బలమైన ఆహారం అందించే విధంగా ముందుకు సాగుతున్నాము. తద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నాము. గర్భిణులకు ఎన్సీ కిట్ ద్వారా డ్రై పిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరం అందిస్తున్నాము. 25 గుడ్లు, రైస్, కందిపప్పు, వంటనూనె, పాలు అందిస్తున్నాము. ఏడు నెలల చిన్నారి నుండి మూడేళ్ల వరకు బాలామృతం, గుడ్లు సకాలంలో అందిస్తున్నాము. చిన్నారులు, తల్లులు ఉత్సాహంగా పాల్గొంటారు.



ఇంద్రాణి, అంగన్‌వాడీ టీచర్, చీరాల అర్బన్

ఒత్తిడితో పెరిగిన పిల్లల్లో ఎదుగుదల లోపం

ప్రస్తుతం చిన్నారుల్లో అధికశాతం మంది రెడీమేడ్ ఆహారానికి చేరువ అవుతున్నారు. తల్లిదండ్రుల పని భారం, లేక ఇతర కారణాలతో చిరుతిండిపైనే దృష్టి సారిస్తున్నారు. తద్వారా శారీరక ధృఢత్వం ఉండదు. పైగా చిన్న వయస్సులోనే అనారోగ్యం బారిన పడుతున్నారు. పిల్లలు మంచి భవిష్యత్తు ఉండాలంటే ప్రారంభం నుండే బలమైన ఆహారం అందాలి. ఆట పాటలు ఉండాలి. అప్పుడే చక్కటి శరీర సౌష్టవం ఉంటుంది.



తిరుమలశెట్టి ఝాన్సీ, సీడీపీవో, వేటపాలెం ప్రాజెక్టు

అంగన్‌వాడీ కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ

గత పరిస్థితులను అధిగమించి ప్రస్తుతం జిల్లా పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు ఉన్నత అధికారుల నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. అలాగే పోషకాహారం అందించే విధంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటాము.



దొనకొండ రాధామాధవి, ఐసీడీఎస్ పీడీ, బాపట్ల

ఆ రోడ్డులో ప్రయాణం భయానకం

గతుకుల దారితో కొత్తపేట వాసుల అవస్థలు

కొత్తపేట(చీరాల), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆ రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. అత్యవసర వైద్యం కోసం ఒంగోలుకు, చీరాల వైపుకు ప్రయాణించే 108 వాహనాలు సైతం పదుల సంఖ్యలో రవాణా సాగిస్తాయి. అయినా ఆ



తక్కువ వేగంతో ప్రయాణిస్తున్న అంబులెన్స్

రోడ్డు మాత్రం అధ్వానంగా ఉంది. ఇది 216 జాతీయ రహదారి నుండి కొత్తపేట ప్రధాన రహదారి. దాదాపుగా చీరాల ఏరియా హాస్పిటల్ సమీపం నుంచి జాతీయ రహదారి వరకు కొత్తపేట పరిధిలోని ప్రధాన రహదారి దాదాపుగా శిథిలావస్థకు చేరుకుంది. అసలే సింగిల్ రోడ్డు, పైగా రోడ్డంతా గుంతల మయం, దీంతో రామాపురం, పాపాయిపాలెం ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణానికి రాకపోకలు సాగించాలంటే విసుగు చెందాల్సిందే. అంతేకాకుండా జాతీయ రహదారితో పాటు, రామాపురం ఇతర ప్రాంతాల్లో యాక్సిడెంట్ కేసులు, వివిధ



అధ్వానంగా ఉన్న రోడ్డు అంచులు

అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన వారితో పాటు, ఒకవేళ చీరాల నుంచి అత్యవసరంగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలాలన్నా నరకం అనుభవించాల్సిందే. దీంతో ప్రజలు తీవ్రయాతన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

కిశోర బాలికలకు వేసవి తరగతులు

బల్లికురవ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న కిశోర బాలికలకు వేసవి తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సలోమీ, మీరాబీ, విజయనిర్మల తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం కింద వేసవిలో ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో బాలికలను గ్రూపులుగా విభజించి వారికి తరగతుల నిర్వహణతో పాటు బాల్య వివాహాల వలన కలుగు నష్టాల గురించి వివరించాలన్నారు. మే 2 వ తేదీ నుండి జూన్ 15 వరకు ఈ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ మహిళ పోలీసు, అంగన్ వాడీ కార్యకర్త, ఏఎన్ఎంలు ఈ టీంలో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారి రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పూర్తి

● త్వరలో ప్రారంభించనున్న మంత్రి రవికుమార్



పట్టణంలోని రేణింగవరం రోడ్డులో నిర్మాణం పూర్తయిన యూహెచ్‌సీ

అద్దంకి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్‌సెంటర్ భవనం నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో సుమారు రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న కాకానిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌కు సంబంధించిన పనులు 95 శాతానికి పైగా పూర్తయ్యాయి. మే నెల మొదటి వారంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా, కాకానిపాలెం అర్బన్ హెల్త్‌సెంటర్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కొత్త భవనంలో అద్దంకి పట్టణ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

బస్ సౌకర్యం కల్పించండి

పంగులూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలకు బస్‌సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రజా అవసరాలను గుర్తించి వెంటనే బస్ ఏర్పాటు చేయాలని చినమల్లవరం, కలంవారిపాలెం, బూదవాడ గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రమైన పంగులూరుకు చేరుకోవాలంటే ఆటోలకు అధిక మొత్తంలో చార్జీలు చెల్లించాల్సి వస్తోందన్నారు. వివిధ పనుల నిమిత్తం వెలుగు కార్యాలయానికి చేరుకునేందుకు, బ్యాంక్ కార్యకలాపాల నిమిత్తం డ్వాక్రా మహిళలు మండలానికి చేరుకునేందుకు వాహన వసతి లేక నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నిత్యం మండల కేంద్రంతో పాటు అద్దంకి, ఇతర ప్రాంతాలకు విద్య, వైద్య అవసరాలతో పాటు ఇతర పనుల నిమిత్తం వెళ్లేందుకు జాతీయ రహదారికి చేరుకోవాలన్నా బస్‌వసతి లేక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలకు బస్ వసతి విషయమై మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ తమ వినతిని స్వీకరించి ఆర్టీసీ అధికారులకు ఆదేశాలిచ్చినా అద్దంకి డిపో అధికారులు కాలయాపన చేస్తున్నారని బూదవాడ టీడీపీ నేత కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు గ్రామాల ప్రజా అవసరాలను గుర్తించి ఆర్టీసీ. అధికారులు తమ గ్రామాలకు వెంటనే బస్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

30న మున్సిపల్ సాధారణ సమావేశం

అద్దంకి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు. 26 అంశాల అజెండా ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్.ఎం.డి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. 500 మార్కులు పైగా సాధించిన 13 మంది బాలబాలికలకు పుష్ప గుచ్ఛాలు, సీల్డ్ పెన్నులు అందజేసి అభినందనలు తెలిపారు. షేక్ షరీఫ్ 576/600, ఎం.హరిత 569, ఎం.రాజ్‌కుమార్-565, ఎం.సంతోష్-550, ఎం.చంద్రిక-536, జి.దుర్గా భవాని-533, వి.శ్రీవల్లి -530, కె.శ్రీలత-517 మార్కులు సాధించి నట్లు తెలిపారు. అభినందన కార్యక్రమం లో ఇన్‌చార్జ్ హెచ్.ఎం, ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, బి.చెంచారెడ్డి, పి.బ్రహ్మయ్య, ఎ.సుబ్బరాజు, ఎస్.రమణమూర్తి, కమలహాసన్, వెంకటేశ్వర్లు, పి.డి. అనిల్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.సుదర్శనరెడ్డి, భీమారెడ్డిలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హెచ్ఎం



షబానాను సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

కష్టపడి చదివితేనే ఫలితం

ఇంకొల్లు, ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు కష్టపడి చదివితే ఫలితం తథ్యమని ఎంఈవోలు శ్రీనివాసకుమార్, శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఈ ఏడాది పదిఫలితాల్లో మండలం ప్రథమ ర్యాంకు సాధించిన స్థానిక ఆదర్శహైస్కూల్ విద్యార్థిని షేక్ షబానాను, కొనంకి రెసిడెంట్ తోటకూర విజయకాంత్ ను శనివారం సత్కరించారు. కష్టపడి చదివి 593 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షబానా తండ్రి జానీబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

అద్దంకి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గీతా మందిరంలో శనివారం షేక్ మస్తాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల అధికారులు యర్రగుంట కృష్ణమూర్తి, యు.వి. గోపాలరావు, తగిరిశ వీరాంజనేయులు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు గా అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు, కార్యదర్శి గా నిమ్మరాజు నాగేశ్వరరావు, కోశాధికారిగా వారణాసి రఘురామశర్మ, అసోసియేట్ అధ్యక్షులుగా న న్రా గోపాలరావు, పల్లపు అంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా కె.దేవసహాయం, ఉపాధ్యక్షులు గా ఎ ప్రభాకరరావు, పొన్నపల్లి బ్రహ్మానందం, పల్లాటి జయరాణి,ఆడిట్ చిన్నయోగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి గా పెండ్యాల అంకయ్య ఆవుల చిరసాంబశివరావు, చాకిరి మోహనరావులను ఏక గ్రీవంగా ఎన్నుకొనా ప్రమాణ స్వీకారం చేశారు. సమావేశంలో



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

సంధిరెడ్డి వెంకటేశ్వర్లు, డాక్టర్ యు.దేవపాలన, చెన్నుపాటి రామాంజనేయులు, జ్యోతి వం ద్రమౌళి, మోపర్తి వెంకటరావు, తాతయ్య వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

చినగంజాం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖవారి ఆధ్వర్యంలో శాఖ గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు ఎ.వెంకటలక్ష్మీనరసింహాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 నుంచి ప్రారంభమయ్యే వేసవి విజ్ఞాన శిబిరంలో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థుల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్, తెలుగు భాషా పద్యాలు, వివిధ సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం పూర్తిగా ఉచితమని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకులు కోరారు.

కనులపండువగా రంగనాథ కల్యాణం







రంగనాథస్వామి ఉత్సవమూర్తి, వీరాంజనేయస్వామికి ఆకుపూజ చేస్తున్న అర్చకులు, పొంగళ్లు వండుతున్న మహిళలు

మార్టూరు, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనుకర్లపూడి కూడలి సమీపంలోని జాతీయరహదారి పక్కనే ఉన్న శ్రీరంగనాథస్వామి దేవస్థానం 30వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సుదర్శన వెంకట రంగనాథస్వామి శ్రీదేవి భూదేవి సమేత శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస నరసింహ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి శాంతి కల్యాణాన్ని భక్తుల సమక్షంలో, భక్తులు కనులారా తిలకిస్తుండగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు జరిగిన స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు మార్టూరు, జనుకర్లపూడి, కోనంకి, జొన్నతాళి గ్రామాల నుంచి భక్తులు ముఖ్యంగా మహిళలు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి, స్వామి వారిని శాంతి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దేవస్థానాన్ని విద్యుత్ దీపాలంకరణతో అందంగా తీర్చిదిద్దారు. కోలాటం, రంగులరాట్నాలతో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. జాతీయరహదారి పక్కన దేవస్థానం ఉండడంతో రోడ్డుకిరువైపులా భక్తులు ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఎస్ఐ బాషా ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు నిర్వహించారు.

ఈశాన్య రామాలయంలో 16 రోజుల పండుగ

పునఃప్రతిష్ఠ చేసిన మార్టూరు లోని ఈశాన్య రామాలయంలో శనివారం సీతారాముల కల్యాణం 16 రోజుల పండుగను నిర్వహించారు. ఒంటిమిట్టలోని రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించిన రోజు ఈశాన్య రామాలయంలో స్వామి కల్యాణం నిర్వహించారు. దీంతో శనివారం 16 రోజుల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. తరువాత భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు.

బల్లికురవ : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు పెద్దఎత్తున వీరాంజనేయస్వామి వారిని దర్శించుకుని ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి గుడిమెళ్ల పవన్ శాస్త్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా మహిళ భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పెదఅంబడిపూడి, చిన అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి, వల్లాపల్లి తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తిరునాళ్లను వీక్షించారు. అనంతరం దేవాలయ కమిటీ తరుపున అన్నదాన కార్యక్రమాన్ని రాత్రి వరకు నిర్వహించారు.

రెండు విద్యుత్ ప్రభల ఏర్పాటు

వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా చిన అంబడిపూడి, పెదఅంబడిపూడి గ్రామంలో కూడా టీడీపీ నేతలు రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. దేవాలయ కమిటీ తరుపున తిరునాళ్ల ఏర్పాటు చేశారు. ప్రభలపై పాటకచేరీలు ప్రజలను అలరించాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి రెండు విద్యుత్ ప్రభలను తిరునాళ్లలో టీడీపీ నేతలు ఏర్పాటు చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభల ఏర్పాట్లను టీడీపీ నేతలు కీలారి వెంకటేశ్వ, దద్దాల అంజయ్య, విజయ్, నాయుడు, బొట్టుగంట వేణుబాబు, వైస్ సర్పంచ్ జాస్తి బ్రహ్మేలు దగ్గరఉండి పర్యవేక్షించారు. సీఐ వెంకటేశ్వ, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు భద్రతను పర్యవేక్షించారు.